మంగళవారం
26-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 96
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భారత్‌కు రెండు స్వర్ణాలు

షూటింగ్‌లోనే తొలి బంగారు పతకం

చైనాలో జరుగుతున్న ఆసియాక్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం షూటింగ్, మహిళల క్రికెట్‌లో రెండు స్వర్ణ పతకాలను భారత్ గెలుచుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ తొలి బంగారు పతకాన్ని ముద్దాడింది. ఆసియాక్రీడల 2023లో భారత్‌కు ఇదే మొదటి పసిడి పతకం కావడం విశేషం.

2 లో

ఎన్‌డీఏకి ఎదురుదెబ్బ

బీజేపీతో అన్నాడీఎంకే తెగదెంపులు

చెన్నై: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ నుంచి అన్నాడీఎంకే పార్టీ వైదొలిగింది. ఎన్‌డీఏ, బీజేపీతో సంబంధాలు తెంచుకుంటున్నట్టు స్పష్టమైన ప్రకటన చేసింది. దీంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. నేటి నుంచి బీజేపీ, ఎన్‌డీఏ కూటమితో అన్ని సంబంధాలు తెంచుకోవాలని అన్నా డీఎంకే నిర్ణయించుకుంది. రాష్ట్ర పార్టీల పొత్తుతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. అన్నాడీఎంకే పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశం సోమవారం ఇక్కడ జరిగింది. బీజేపీ, ఎన్‌డీఏతో తెగదెంపులపై సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. బీజేపీతో తెగదెంపులు చేసుకుంటున్నట్టు అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి ప్రకటించారు. ఏడాదికాలంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం తమ పార్టీ కీలక నేతలు, తమ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, కార్యకర్తల గురించి అనవసర, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తోందని విమర్శించారు. బీజేపీతో తెగదెంపులపై అన్నా డీఎంకే స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. 'అన్నా డీఎంకే పార్టీతో పాటు ఆ పార్టీ నేతలు అన్నాదురై, జయలలిత పరువు, ప్రతిష్ఠను దిగజార్చేలా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఉద్దేశపూర్వకంగా పదేపదే వ్యాఖ్యలు చేస్తోంది. దీంతో బీజేపీ, ఎన్‌డీఏ నుంచి బయటికి రావాలని నిర్ణయించుకున్నాం. రానున్న పార్లమెంటు ఎన్నికల కోసం రాష్ట్ర పార్టీలతో పొత్తు పెట్టుకుంటాం' అని ఆ ప్రకటన తెలిపింది. కొంతకాలంగా తమిళనాడులోని బీజేపీ, అన్నాడీఎంకే నేతల మధ్య అనేక అంశాలపై తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తిన విషయం విదితమే. ఈ విభేదాలు తారస్థాయికి చేరడంతో అన్నాడీఎంకే తాజా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, ద్రవిడ దిగ్గజం అన్నాదురైపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వివాదాస్పద

- మిగతా 2 లో

భూ పంపిణీతోనే పేదలకు లబ్ధి

రాష్ట్రంలో ప్రభుత్వ బంజరు భూములు పేద వర్గాలకు పంపిణీ చేసినప్పుడే వారి జీవితాల్లో వెలుగు నిండుతుంది. 90 ఏళ్లుగా భూ పంపిణీ కోసం ఎర్రజెండా రాజీలేని పోరాటం చేస్తోంది. ఈ పోరాటంలో అనేక విజయాలు సాధించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల భూ పంపిణీ చట్టాలకు తూట్లు పడుతున్నాయి. సాగుభూమి పేదలకు పంపిణీ చేసి సామాజిక న్యాయం, ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు పూనుకోవాలి. ఇది ప్రభుత్వాల కనీస బాధ్యత. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు బాపట్లలో ఉత్సాహభరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది వ్యవసాయ కార్మికులు బాపట్లలో కదం తొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో సీపీఐ, బీకేఎంయూ జాతీయ, రాష్ట్ర నాయకులు ప్రసంగించారు.

8 లో



చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై

నేడు సుప్రీం విచారణ?

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించే అవకాశం ఉంది. ఈనెల 22న హైకోర్టు చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించింది. సెక్షన్ 482 కింద దాఖలైన నేపథ్యంలో మినీట్రయల్ నిర్వహించలేమని పేర్కొంది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న సీమెన్స్‌కు నిధుల విడుదలకు చంద్రబాబు సిఫార్సులపై స్పష్టత లేదని, దీనిపై నిపుణులతో చర్చ అవసరమని తెలిపింది. సీఐడీ దర్యాప్తు తుది దశలో ఉన్నందున జోక్యం చేసుకోలేమని హైకోర్టు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో న్యాయవాది ప్రమోద్ కుమార్ 23వ తేదీన దాఖలు చేశారు. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా... భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ ఎదుట ఈ కేసు

- మిగతా 2 లో

నిర్బంధం...అణచివేత

- అంగన్వాడీలపై పోలీసు ఉక్కుపాదం
- అడుగడుగునా ఆటంకాలు, అరెస్టు
- నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన 'చలో విజయవాడ'పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విజయవాడ ధర్నా చౌక వద్ద అంగన్వాడీలు సోమవారం సామూహిక దీక్షకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ అంగన్వాడీలను అరెస్టు చేశారు. అనేకచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పోలీసుల అణచివేతను గుర్తించిన కొంతమంది అంగన్వాడీలు మారు వేషాల్లో విజయవాడకు చేరుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు

- మిగతా 2 లో

ఇది పోలీస్ రాజ్యం

- జగన్ రాష్ట్ర పాలనను డీజీపీకి అప్పగిస్తే సరి
- ప్రజాసంఘాల మహాసభలకు కూడా అనుమతి కావాలా?
- రాష్ట్రంలో పరిస్థితులపై రాష్ట్రపతి, గవర్నర్‌లను కలుస్తాం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలను అణచివేసే పనిలోనే పోలీసు వ్యవస్థ నిమగ్నమై ఉందన్నారు. ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాల్సిన ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్మికుల శాంతియుత ఆందోళన సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకుల్ని పోలీసులు అరెస్టు చేశారని... ఈ రకమైన పాలన చేయటం ఏమిటి? అని నిలదీశారు. పోలీసులు రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో టెంట్‌లు వేసుకుని కాపలాకాస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికుల అరెస్టులను, నిర్బంధాలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే వరకూ నన్ను పనిచేయమని అడక్కు!

గ్రామ, వార్డు సచివాలయాలు చట్ట విరుద్ధం

- ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా ఏర్పాటును తప్పుబట్టిన కాగ్
- అమరావతి అభివృద్ధికి బడ్జెట్ తోడ్పాటు లేదు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు తీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పుబట్టింది. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా వీటిని ఏర్పాటు చేయడం సరికాదని పేర్కొంది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికలను సమర్పించింది. వార్డు కమిటీలు లేకుండా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు ఆడిట్ నివేదికలో పేర్కొంది. వికేంద్రీకరణ పాలన కోసమే ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లుగా కాగ్ తెలిపింది. 2019 జులైలో ఏర్పాటైన ఈ వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిందంటూ అక్షింతలు వేసింది. క్షేత్రస్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయడం స్థానిక స్వపరిపాలనను దెబ్బతీయడమేనని స్పష్టంచేసింది. స్వపరిపాలన సాధనకు

- మిగతా 2 లో

నూతన విద్యా విధానం

అమలులో సమస్యలు తప్పవు

2 లో

మహిళా రిజర్వేషన్‌కు మద్దతుగా

అసెంబ్లీ తీర్మానం

- మూడేళ్ల క్రితమే రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు
- సీఎం జగన్‌ను కొనియాడిన మంత్రి ఉషశ్రీచరణ్
- మహిళా సాధికారతలో దేశానికే ఏపీ ఆదర్శమన్న రోజా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడానికి మద్దతుగా ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. సోమవారం శాసనసభలో మహిళా సాధికారతపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ జరిగింది. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో మహిళా సాధికారతకు అడుగులు వేశామని, వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలను సీఎం జగన్ ఆదుకుంటున్నారన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పుడు ఆమోదం పొందగా... మూడేళ్ల ముందు నుంచే రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు జగన్ కల్పిస్తున్నారని కొనియాడారు. యువత పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా చంద్రబాబు యువతను మోసం చేశారని ఆరోపించారు. హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకు మిగతా డెయిరీలకు నష్టం కలిగించారని విమర్శించారు. స్కాముల సీఎంగా చంద్రబాబు గుర్తుండిపోతారని, సీఎం జగన్ మాత్రం మహిళా సాధికారత కోసం గత ప్రభుత్వాల కంటే పదిరెట్లు ఎక్కువ ఖర్చు చేసి చరిత్రలో నిల్చిపోయారంటూ సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ప్రతి ఆడబిడ్డ కన్నీళ్లు సీఎం జగన్ తుడిచారని, మహిళా సాధికారత కోసం చేసిన కృషి అమోఘమన్నారు. ప్రతి ఆడబిడ్డ కష్టాలు సీఎం జగన్ తీరుస్తున్నారని, మహిళల కోసం చేసిన కృషిని చూసి మహిళలందరూ జయహో జగన్ అంటున్నారని చెప్పారు. సంక్షేమం అంటే ఏమిటో నాలుగున్న రేళ్లలో చేసి చూపించారని, గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో మహిళలు ఆర్థికంగా ఎంతో బలంగా మారారన్నారు. 14 ఏళ్లలో చంద్రబాబు ఏం చేశారో చెప్పగలరా? ఆడపుట్టకనే ఎగతాళి చేసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు చీటర్... జగన్ లీడర్, చంద్రబాబు చెప్పేవన్నీ మాయమాటలేనని మహిళలందరికీ తెలుసని, ఆయనను ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. బాలకృష్ణ మొన్న తొడగొట్టారు... ఇవాళ తోక ముడిచారని, సీఎం జగన్ సంక్షేమ పథకాలపై బాలకృష్ణ చర్చకు రాగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో టీడీపీ ప్రతిపక్ష పార్టీ కాదని,

- మిగతా 2 లో

ముగిసిన కేఎన్ఈ యువజనోత్సవం

ఏథెన్స్: గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో నిర్వహించిన మూడురోజుల 49వ కేఎన్ఈ-ఒడిగిటిస్ ఉత్సవం ముగిసింది. స్ఫూర్తినింపిన రాజకీయ కార్యక్రమంగా వేడుక సాగింది. కమ్యూనిస్ట్ యూత్ ఆఫ్ గ్రీస్ (కేఎన్ఈ) అధ్వర్యంలో ప్రపంచదేశాల కమ్యూనిస్టు యువజన సంఘాల సమక్షంలో యువజోత్సవాలు వైభవంగా జరిగాయి. వేలాది మంది కమ్యూనిస్టులు, వర్కర్లు, హాజరయ్యారు. చిన్న, పెద్ద తేడా లేకుండా పురుషులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. దీంతో ఉత్సవాల వేదికైన ట్రిట్సిస్ పార్కు కిక్కిరిసి పోయింది. ముగింపు వేడుకలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్‌సోంబస్ ప్రధాన వక్త కాగా కేఎన్ఈ కార్యదర్శి థోడోరిస్ కౌట్సాంటిస్, కేకేఈ పొలిటికల్ బ్యూరో సభ్యులు గియన్నిస్ ప్రోటౌలిస్ ప్రారంభోప న్యాసాలు చేశారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో యువజనోత్సవాలు అనేక కార్యక్రమాల సమాహా రంగా జరిగాయి. యువ కమ్యూనిస్టులను ఉత్తేజ పరుస్తూ, వారిలో స్ఫూర్తిని నింపడమే కాకుండా చైతన్యపరిచే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా కేఎన్ఈ-ఒడిగిటిస్ ఉత్సవం నిలిచింది. చీకటిని తొలగించే కిరణంగా సోషలిజం మార్గాన్ని అనుసరించేలా విప్లవకవి నజీమ్ హిక్మెట్ స్ఫూర్తితో యువజనోత్సవాలు జరిగాయి. సంగీత కచేరిలో ప్రముఖ కళకారులు మారియా ఫరాంటోరి, జార్జ్ దలారస్, వసిలిస్ పాల్గొన్నారు. స్టాండప్ కామెడీ, నాటకాలు, క్రీడా కార్యక్రమాలు, వివిధ ప్రదర్శనలు యువతను ఆకట్టుకున్నాయి. ప్రపంచ కమ్యూనిస్టు యువజన సంఘాలన్నీ ఉత్సవంలో పాలుపంచుకోగా క్యూబా, వెనిజులా తరపున కార్యక్రమాలను కేఎన్ఈ నిర్వహించింది. కేఎన్ఈ-ఒడిగిటిస్ ఉత్సవానికి 45ఏళ్ల చరిత్ర ఉంది. తొలి ఉత్సవం 1975 అక్టోబరులో జరిగింది.

విశాలాంధ్ర ప్రపంచం

క్యూబా దౌత్యకార్యాలయంపై ఉగ్రదాడి

రెండు మొలోటోవ్ కాక్‌టెయిల్స్ విసిరిన దుండగుడు

హవానా: అమెరికా రాజధాని నగరమైన వాషింగ్టన్ డీసీలోగల క్యూబా దౌత్య కార్యాలయంపై ఆదివారం రాత్రి ఉగ్రదాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి రెండు మొలోటోవ్ కాక్‌టెయిల్స్‌ను భవనంపైకి విసిరాడు. ఇదే భవనంపై ఉగ్రదాడి జరగడం రెండో సారి కాగా 2020లోనూ ఏకే 47తో దాడి జరిగింది. ఈ దాడిని క్యూబా తీవ్రంగా ఖండిం చింది. తమ దేశంపై ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తూ అమెరికా ప్రభుత్వం రెచ్చిపోతుంటే క్యూబా వ్యతిరేక సంఘాలు ఇటువంటి దుశ్చర్యల ద్వారా వినోదం పొందుతున్నాయని దుయ్యబట్టింది. ఎక్స్ మాధ్య మంగా క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్స్ స్పందిస్తూ రాయబార కార్యాలయంపై రెండు మొలోటోవ్ కాక్‌టెయిల్స్‌తో దాడి జరిగినట్లు తెలిపారు. ఎవరికి గాయాలు కాలేదన్నారు. ఈ దాడిపై దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. 2020 ఏప్రిల్‌లో ఏకే 47 మారణాయుధంతో ఓ వ్యక్తి కాల్పులకు తెగబడ్డాడని గుర్తుచేశారు. 2021 జులైలో ఫ్రాన్స్‌లోని క్యూబా దౌత్యకార్యాలయంపై మొలోటోవ్ కాక్‌టెయిల్స్‌తో దాడి జరిగిందన్నారు. న్యూయార్క్‌లో జరిగిన 78వ ఐరాస సర్వసభ సమావేశానికి హాజరైన క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనాల్ తిరిగి హవానాకు చేరుకున్న కొన్ని గంటల్లోనే ఈ దాడి జరిగింది. క్యూబా ప్రస్తుతం జీ77+ చైనా కూట మికి అధ్యక్షత వహిస్తోంది. క్యూబా దౌత్యకార్యాలయంపై దాడి గురించి ఇప్పటివరకు అమెరికా ప్రభుత్వం స్పందించలేదు. అయితే ఉగ్రవాదులకు రక్షణ కల్పించడాన్ని అమెరికా మాను కోవాలని, తాజా ఘటనపై దర్యాప్తు జరిపించాలని పీపుల్స్ ఫోరం తరపున సంస్థ డైరెక్టర్ మోనోలో డే లాస్ శాంటోస్ డిమాండ్ చేశారు. ఇటువంటి దాడులను ఉగ్రవాద దుశ్చర్యగా పరిగణించాలని అమెరికా ప్రభుత్వానికి నేషనల్ నెట్వర్క్ ఆన్ క్యూబా (ఎన్ఎన్ఓసీ) ప్రతినిధి కల్లా వాష్ సూచించారు. క్యూబాకు మద్దతు ప్రకటించారు. క్యూబాపై యుద్ధాన్ని, అమెరికా దిగ్బంధాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. 2020లో జరిగిన దాడి వల్ల బుల్లెట్లు దిగిన ఆనవాళ్లు భవనంలో నేటికీ ఉన్నాయని వెల్లడించారు. క్యూబా దౌత్యకార్యాలయం వద్దకు చేరుకొని సంఘీభావం ప్రకటించాలని అమెరికా ప్రజలకు ఎన్ఎన్ఓసీ పిలుపునిచ్చింది. క్యూబా దౌత్యకార్యాలయంపై దాడిని బ్రిడ్జెజ్ ఆఫ్ లవ్, డీసీ చాప్టర్ ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ది యూఎస్ఎస్ తీవ్రంగా ఖండించాయి. క్యూబాకు వెనిజులా, మెక్సికో తదితర దేశాలు సంఘీభావం ప్రకటించాయి. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నట్లు క్యూబాపై అమెరికా ఆరోపణలు చేస్తుంది కానీ వాస్తవానికి ఉగ్రదాడుల బాధిత దేశంగా క్యూబా ఉందని అమెరికాకు చెందిన యుద్ధ వ్యతిరేక సంఘం 'కోడెపింక్' సహ-వ్యవస్థాపకులు మాడియే బెంజమిన్ వెల్లడించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుపై

డివిజన్ బెంచ్‌కు టీఎస్పీఎస్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్: పేపర్ లీకేజీల కారణంగా టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై టీఎస్‌పీఎస్సీ అప్పీల్‌కు వెళ్లింది. అత్యవసర విచారణకు అనుమతి కోరింది. కాగా పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ అంగీకరించింది. గ్రూప్ -1 ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ ఈ నెల 23న హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుతో అభ్యర్థులతోపాటు కమిషన్‌లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు పరీక్ష రాశామని, మూడోసారి రాయాల్సి రావడంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి ప్రిలిమినరీ పరీక్ష అంటే లక్షల మంది అభ్యర్థులు మానసికంగా ఇబ్బందులకు గురవుతారని కమిషన్ సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌కు టీఎస్‌పీఎస్సీ అప్పీలు చేసింది.

ఎన్‌డీఏకి ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. దీంతో రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. 1956లో మదురైలో జరిగిన ఒక కార్యక్రమంలో అన్నాదురై హిందూ మతవిశ్వాసాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు అన్నామలై పేర్కొన్నారు. ఆ తర్వాత రెండు పార్టీల మధ్య మాటలయుద్ధం జరిగింది. వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని అన్నాడీఎంకే డిమాండ్ చేయగా... అందుకు ఆయన నిరాకరించారు. తాను అన్నాదురై గురించి తప్పుగా మాట్లాడలేదని, 1956లో జరిగిన సంఘ టన గురించి మాత్రమే గుర్తుచేశానని చెప్పుకొచ్చారు. అన్నాదురై చేసిన వ్యాఖ్య లను స్వాతంత్ర్య సమరయోధుడు పసుంపోన్ ముత్తురామలింగ తేవర్ తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఈ వ్యాఖ్యలతో రెండు పార్టీల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ పరిణామాలపై చర్చించడానికి అన్నాడీఎంకే పార్టీ సోమవారం ఇక్కడ సమావేశమైంది. ఎన్‌డీఏ కూటమి నుంచి బయటకు రావాలని సమావేశం నిర్ణయించింది. బీజేపీ వైఖరి కారణంగా తెగతెంపులు చేసుకుంటున్నట్లు ఆ పార్టీ నేత మునుస్వామి స్పష్టంచేశారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూటమి నుంచి వైదొలగడంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేడు సుప్రీం విచారణ?

(మొదటిపేజీ తరువాయి)

ఉంచారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని సీజేఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 8న చంద్రబాబు అరెస్ట్ అయినట్లు తెలిపారు.మంగళవారం మెన్షన్ లిస్ట్ ద్వారా రావాలని సిద్ధార్థ లూత్రాకు సీజేఐ సూచించారు. చంద్ర బాబు క్వాష్ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని, ఆయనను అన్యా యంగా రిమాండ్‌లో ఉంచారని న్యాయవాది విజ్ఞప్తి చేయగా అన్ని విషయాలు మంగళవారం వివరించేలా సీజేఐ సూచనలు చేశారు. ఏపీ ప్రభుత్వం తరపున హైకోర్టులో వాదించిన ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీఐడీ తరపున వాదించిన రంజిత్‌కుమార్ కూడా సుప్రీంకోర్టుకు హాజరయ్యారు.

గ్రామ, వార్డు సచివాలయాలు చట్ట విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులతో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది. 2019 ఫిబ్రవరి నుంచి అమరావతికి బడ్జెట్ తోడ్పాటు అందించలేదు. నగరాభివృద్ధి నిధులకు రుణాల సేకరణే ప్రధాన వనరుగా నిర్ణయించారు. అమరావతి అభివృద్ధికి రూ.33,476 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకు న్నారు. ఏపీసీఆర్డీఏ రూ.8,540 కోట్లు మాత్రమే అప్పు చేసింది. రాజధాని నగరాభివృద్ధిపై విధాన మార్పు వల్ల 2019 మే నుంచి అభివృద్ధి ప్రణా ళికలో అనిశ్చితి నెలకొంది. 55 ప్యాకేజీల పూర్తికి రూ.28,047 కోట్లు అవసరం. అమరావతిలో భూ సమీకరణకు రూ.2,244 కోట్లు ఖర్చు చేశారు. సమీకరించిన భూమి అభివృద్ధి లేకుండా నిరుపయోగంగా ఉంది. ఫలితంగా ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లక్ష్యం నెరవేరలేదని కాగ్ నివేదిక పేర్కొంది.

ఇది పోలీస్ రాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు బాపట్లలో నిర్వహించేందుకు స్థానిక పోలీసుల నుంచి అనుమతి తీసుకోవడం జరిగిందనీ, డీఎస్పీ సూచన మేరకు బహిరంగసభ స్థలాన్ని కూడా మార్చటం జరిగిందన్నారు. ఇప్పుడు మహాసభలకు అనుమతి లేదని చెబుతూ... వ్యవసాయ కార్మిక సంఘం నేతలకు పోలీసులు నోటీసులు జారీచేయడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏనాడు ఇలా జరగలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి పిచ్చి పరాకాష్ఠకు చేరిందని, జగన్ తన పేరును పిచ్చి రెడ్డిగా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఏ రాష్ట్రంలో కూడా ఇలా జరగలేదన్నారు. అసలు ముఖ్యమంత్రికి విజ్ఞత ఉందా? అని ప్రశ్నించారు. ప్రజాసంఘాల మహాసభలు కూడా జరుపుకోకూడదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సొంత కార్లలో వస్తుంటే పోలీసులు వారిని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో అడ్డుకుని బెదిరిస్తారా? అదేమన్నా ఇండియా, పాకిస్తాన్ సరిహద్దా? అంతమంది పోలీసులను మోహరించాల్సిన అవసరమేమొచ్చింది? అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు చలో అసెంబ్లీకి పిలుపునివ్వటం సహజం అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ... ర్యాలీలు, ధర్నాలు, మహాసభలు, చలో విజయవాడ వంటి కార్యక్రమాలు చేయకూడదనే చట్టాన్ని కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదిస్తే జగన్‌మోహన్‌రెడ్డి కళ్లు చల్లబడతాయన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందనీ, జగన్మోహన్‌రెడ్డికి పరిపాలన చేయటం చేతకాకపోతే రాష్ట్ర డీజీపీకి పాలనా పగ్గాలు అప్పగించాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ఏర్పాట్లు చేసుకుంటే... లిఖితపూర్వకంగా బెదిరించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. దేశ ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా ప్రకటించలేని కాలం అమృత కాలం ఎలా అవుతుందని, ఇదేనా నరేంద్రమోదీ చెప్పే అమృతోత్సవ్, అచ్చేదిన్ అని ప్రశ్నించారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంత దుర్మార్గం ఏమిటి? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో విపత్కర పరిస్థితులను సృష్టిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మోదీ ఆశీస్సులు న్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పరిస్థితులపై రాష్ట్రపతి, గవర్నర్‌లను కలిసి వివరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

భారత్‌కు రెండు స్వర్ణాలు

షూటింగ్‌లోనే తొలి బంగారు పతకం

హాంగ్‌జౌ: చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం షూటింగ్, మహిళల క్రికెట్‌లో రెండు స్వర్ణ పతకాలను భారత్ గెలుచుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ తొలి బంగారు పతకాన్ని ముద్దాడింది. ఆసియాక్రీడల 2023లో భారత్‌కు ఇదే మొదటి పసిడి పతకం కావడం విశేషం. రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ తోమర్, దివ్యాన్ష్ పన్వర్ బృందం 1893.7 పాయింట్లను నమోదు చేసి ఈ పతకాన్ని సొంతం చేసు కుంది. ఇది ప్రపంచ రికార్డు కావడం విశేషం. గతంలో చైనా చేసిన 1893.3 పాయింట్ల రికార్డును భారత షూటర్ల బృందం అధిగ మించింది. మొత్తంగా షూటింగ్ అంశంలో ఇప్పటివరకు స్వర్ణపతకంతో కలిపి మూడు పతకాలను భారత్ కైవసం చేసుకుంది. కాగా 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ విభాగంలో టీమ్‌గా స్వర్ణ పతకం కొల్లగొట్టిన దివ్యాన్ష్, రుద్రాంక్ష్, తోమర్ వ్యక్తిగతఃఅ విభాగంలోనూ ఫైనల్‌కు చేరుకోవడం మరో విశేషం. తుది పోరు కోసం జరిగిన పోటీల్లో రుద్రాంక్ష్ మూడో స్థానం, తోమర్ ఐదోస్థానం, దివ్యా న్ష్ ఎనిమిదో స్థానంలో నిలిచి.. ఫైనల్‌కు అర్హత సాధించారు.

రోయింగ్ విభాగంలోనూ మరో పతకం

అలానే రోయింగ్ విభాగంలో మరో కాంస్య పతకం భారత్‌కు దక్కింది. మెన్స్ ఫోర్ రోయింగ్ ఈవెంట్లోనూ ఈ పతకం లభించింది. దీంతో రోయింగ్ విభాగంలో ఇప్పటివరకు మొత్తం నాలుగు పతకాలు వచ్చాయి. ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటి వరకూ రెండు స్వర్ణం, మూడు రజతాలు, ఐదు కాంస్య పతకాలను దక్కించుకుంది.

రుతుపవనాలు వెనక్కి

న్యూఢిల్లీ: రుతుపవనాలు వెనక్కి మళ్లాయి. సాధారణంగా సెప్టెంబరు 17న ఈ ప్రక్రియ మొదలు కావాల్సి ఉండగా ఎనిమిది రోజులు ఆలశ్యమైనట్లు భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) తెలిపింది. ఈరోజు నైరుతి రాజస్తాన్ నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లాయని సోమవారం ప్రకటించింది. రుతుపవనాలు ఆలశ్యంగా వెనక్కి వెళ్లిన13వ సంవత్సరం ఇదని వెల్లడించింది. సాధారణంగా దేశంలోని వాయువ్య భాగం నుంచి రుతుపవనాల మళ్లింపు మొదలవుతుంది. ఇది ఆలశ్యమైతే మరిన్ని రోజులు వర్షాలు కురుస్తాయి. దీంతో సాగుపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా వాయువ్య భారతంలో రబీ సాగుకు వర్షాలు కీలకం. జూన్ 1న కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయి. జులై 8 నాటికి దేశమంతటా వ్యాపిస్తాయి. సెప్టెంబరు 17 నాటికి వాయువ్య భారతం నుంచి వెనక్కు మళ్లడం ప్రారంభిస్తాయి. అక్టోబరు 15 వరకు ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. సెప్టెంబరు ఒకటో తేదీ తర్వాత ఐదురోజులు వర్షాలు పడకపోవడం, అప్పపీడనాలు ఏర్పాటు కాకపోవడం, తేమ తగ్గడం వంటివాటి ఆధారంగా రుతుపవనాలు వెనక్కి మళ్లినట్లు ఐఎండీ ప్రకటిస్తుంది.ఈ వర్షాకాలంలో దేశంలో 764.4 ఎంఎంల వర్షపాతం నమోదు కాగా ఇది సాధారణం కంటే ఆరు శాతం తక్కువ.

నూతన విద్యా విధానం

అమలులో సమస్యలు తప్పవు

- ఎంఈఎంఈ భారత్‌కు అనుకూలం కాదు
- పార్లమెంటరీ స్థాయి సంఘం నివేదిక

న్యూఢిల్లీ: నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రతిపాదిం చిన మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ వ్యవస్థ (ఎంఈఎంఈ) పశ్చిమ దేశాల్లోని విద్యావ్యవస్థల్లో అమలు అవుతుంది కానీ భారతీయ విద్యావ్యవస్థకు అది అనుకూలం కాదని పార్లమెంటరీ ప్యానల్ తెలిపింది. ఈ విధానం అమలు సమస్యలతో కూడుకున్నదిగా పరిణమిస్తుందని హెచ్చరించింది. ఎంపీ వివేక్ ఠాకూర్ నేతృత్వ విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై పార్లమెంటరీ స్థాయి సంఘం తాజా నివేదికలో ఈ పద్ధతి అమలు వల్ల సమస్యలు వస్తాయని, వాటిని ఎలా పరిష్కరించాలో విద్యావ్యవస్థలు ఆలోచించలేదని తెలిపింది. 'విద్యార్థుల కోసం మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ (ఎంఈఎంఈ)ని ఎన్ఈపీ ప్రతిపాదించింది. పశ్చిమ దేశాల్లో అమలవుతున్నది కాబట్టి ఇక్కడ అమలు చేయొచ్చని భావించింది. కానీ భారతీయ విద్యావ్యవస్థకు ఇది అనువైనది కాదు. దీనిని అమలు చేయడం సమస్యలభరితంగా ఉంటుంది. దేశంలో అధిక జనాభా కారణంగా ఏటా ఉన్నత విద్యావ్యవస్థలో చేరే వారి సంఖ్య పెరుగుతుంది. ఎంఈఎంఈకి విద్యాసంస్థలు అనుమతిస్తేగనుక ఎంత మంది విద్యార్థులు బయటకు వెళతారో (ఎగ్జిట్) అంచనా వేయడం కష్టమవుతుంది. అలాగే మధ్యలో ఎంత మంది చేరుతారో కూడా చెప్పలేం. విద్యా సంవత్సరం మధ్యలో చదువు మానేసే వారే లెక్క తేలదు. కాబట్టి విద్యా సంస్థలలో రాకపోకల (చేరే వారు, బయటకు వెళ్లేవారు) స్పష్టత ఉండదు. ఫలితంగా విద్యార్థులు-టీచర్ల నిష్పత్తిపై ప్రభావం పడుతుంది' అని గతవారంలో రాజ్యసభకు సమర్పించిన నివేదికలో స్థాయి సంఘం వెల్లడించింది.

చంద్రబాబు తప్పు చేయలేదు

ప్రజా సొమ్ము దోచుకోవాల్సిన అవసరం లేదు: భువనేశ్వరి

విశాలాంధ్ర -జగ్గంపేట: తన కుటుంబానికి ప్రజల సొమ్మును దోచుకోవాల్సిన అవసరం లేదని, తనకున్న కంపెనీలో రెండు వాటా అమ్ముకున్నా రూ.400 కోట్లు వస్తాయని టీడీపీ అధినేత చంద్రబాబు భార్య భువనేశ్వరి అన్నారు. కాకినాడ జిల్లా, జగ్గంపేట పర్యటనలో భాగంగా ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, రిలే నిరహార దీక్షలు చేస్తున్న మహిళలకు సంఘీభావం తెలిపారు. భువనేశ్వరి తమ కుటుంబం ప్రజల కోసమే పనిచేస్తుందని, ప్రజల డబ్బు అవసరం తమకు లేదని చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే ఎన్టీఆర్ తమకు నేర్పారన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రెండువేల మంది అనాధ పిల్లల్ని ఉచితంగా చదివిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబుకు ప్రజలే ఊపిరని, ఆయన ఏ తప్పు చేయలేదని అన్నారు. చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేశారన్నారు. 'స్వాతంత్రం కోసం ఎందరో జైలుకు వెళ్లారు. నా దృష్టిలో చంద్రబాబు కూడా అంతే'అని భువనేశ్వరి తెలిపారు. మహిళాశక్తి చాలా గొప్పదని, వచ్చే ఎన్నికల్లో మహిళలు తమ శక్తిని చూపించాలని ఆమె పిలుపునిచ్చారు. హైదారాబాద్‌లో హైటెక్ సిటీని ఆయన తీర్చిదిద్దారని, నేడు ఆ హైటెక్ సిటి ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తోందన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పించిన వ్యక్తి చంద్రబాబు అని ఆమె చెప్పారు. భువనేవ్వరి వెంట నందమూరి కుటుంబ సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నారాజప్ప, పార్టీ నేతలు జ్యోతుల నెహ్రూ, నవీన్ ఉన్నారు.

మరో ఐదు రోజుల కస్టడీ కోరిన సీఐడీ

చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్లపై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. సీఐడీ కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులను న్యాయస్థానం ఆదేశించింది. ఈ రెండు పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపి ఉత్తర్వులిస్తామని పేర్కొంది. అంతకుముందు రెండు రోజుల కస్టడీ నివేదికను సీఐడీ అధికారులు సీల్డ్ కవర్‌లో న్యాయస్థానానికి అందజేశారు. మరో ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. తొలుత బెయిల్ పిటీషన్‌పై సోమవారం మధ్యాహ్నం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి విచారణ ప్రారంభించారు. బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరగా, ముందు కస్టడీ పొడిగింపుపై దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వినాలని సీఐడీ తరపు న్యాయవాదులు కోరారు. దీంతో మెమో ఫైల్ చేయాలని సీఐడీని న్యాయమూర్తి ఆదేశించారు. మెమో దాఖలుకు సమయం ఇవ్వాలని సీఐడీ కోరడంతో విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తొలుత బెయిల్ పిటిషన్‌పై విచారించాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరగా, ముందు కస్టడీ పిటిషన్‌ను విచారించాలని సీఐడీ న్యాయవాదులు అభ్యర్థించారు. ఉభయవర్గాల వాదనలు విన్న న్యాయస్థానం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది ప్రమోద్ దూబే వాదనలు వినిపించగా, సీఐడీ తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, వివేకానంద కోర్టుకు హాజరయ్యారు.

కస్టడీ విచారణ నివేదిక సీల్డ్ కవర్‌లోఅందజేసిన సీఐడీ

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి రెండు రోజుల పాటు చంద్రబాబుని విచారించిన సీఐడీ ఆ నివేదికను ఏసీబీ కోర్టు న్యాయమూర్తికి సోమవారం సీల్డ్ కవర్‌లో సమర్పించింది. ఇక చంద్రబాబు బెయిల్ పిటీషన్‌కు సంబంధించి జరిగిన విచారణలో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాల మేరకు సీఐడీ తరపు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. వారందించిన కౌంటర్‌లో సవరణలు చేసి మళ్లీ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో పాటు చంద్రబాబును మరో ఐదు రోజుల కస్టడీకి కావాలని కోరుతూ సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది.

అసెంబ్లీ తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

పనికిమాలిన పార్టీ అంటూ ఛలోక్తి విసిరారు. మహిళలకు రాజకీయంగా సీఎం జగన్ ఎన్నో అవకాశాలు కల్పించారని, ప్రతి పేదింటి ఆడబిడ్డకు అండగా ఉన్నారని ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి అన్నారు. మహిళలకు రాజకీయంగా అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించడంతోపాటు, రాష్ట్రంలో మహిళలకు ఎన్నో పథకాలు అమలవుతున్నాయని, అందుకు కారణం సీఎం జగన్ అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కె. శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు అన్ని విధాలుగా సీఎం జగన్ చేయూత అందిస్తున్నారని, పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారని అన్నారు. మహిళలకు ఎన్నో పథకాలు తీసుకొచ్చారని, మహిళల రక్షణకు దిశా యాప్, ప్రత్యేక మహిళా పోలీసుల ద్వారా రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ మహిళా సంక్షేమంలో దేశంలో ఏపీ ఆదర్శంగా నిలిచిందని, మహిళలను శక్తివంతులుగా తయారు చేస్తున్నారన్నారు. మహిళలకు ఆదాయ మార్గాలను చూపిస్తున్నారని, మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, మహిళల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగుతోందని కొనియాడారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, చేయూత, లక్షలాది మందికి ఇంటిస్థలాలు, ఇళ్ల నిర్మాణం వంటి అనేక సంక్షేమ పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనంగా పేర్కొన్నారు.

నిర్బంధం...అణచివేత

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు రాష్ట్రస్థాయి ధర్నాకు సిద్ధమయ్యారు. దీనిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకత్వంలో విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా చేయాలని సంకల్పించి అనుమతి కోరగా ప్రభుత్వం నిరాకరించింది. విజయవాడ ధర్నాను భగ్నం చేయటానికి నాలుగు రోజుల నుంచి పోలీసులు నోటీసులు జారీ చేయటం, నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరించటం, జిల్లాల నుంచి వచ్చే వారిని అడ్డుకోవటం కొనసాగించారు. రెండు రోజుల నుంచి అన్ని బస్టాండులు, రైల్వేస్టేషన్లపై నిఘాపెట్టి దొరికిన వారిని దొరికినట్లు అరెస్టు చేశారు. దూరపు ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో బయలుదేరిన అంగన్‌వాడీలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆదివారం ఉదయం నుంచి 20వేల మందికిపైగా అంగన్‌వాడీలను విజయవాడ రాకుండా అడ్డుకున్నారు. అంగన్వాడీ కార్మికుల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా రాష్ట్ర నలుమూలల నుండి పెద్దసంఖ్యలో విజయవాడ నగరానికి విచ్చేసి ఉద్యమాన్ని కొనసాగించారు. అంగన్వాడీ మహిళల ఉద్యమానికి మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాల ప్రతినిధులు విజయవాడకు చేరుకున్నారు. అయితే, వారు పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. తమకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ, పెన్షన్, ఈఎస్ఐతో పాటు మినీ వర్కర్‌లను కార్మికులుగా గుర్తించాలని, పని పరిస్థితులను మెరుగుపరచాలన్న డిమాండ్లతో అంగన్వాడీలు కదంతొక్కారు. వేలాది మంది పోలీసులను మోహరించి...ధర్నాచౌక్‌ను రణరంగంగా మార్చేశారు. అంగన్వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. ఏఆర్ గ్రౌండుకు 800 మంది, ఆటోమొబైల్ హాలుకు 800 మంది, భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు 80 మంది, సింగ్‌నగర్ వడ్డెర కాలనీ కళ్యాణమంటపానికి 250 మంది, కండ్రిక కమ్యూనిటీ హాల్‌కు 250 మంది, నక్షత్ర కళ్యాణమంటపానికి 200 మంది అంగన్వాడీలను తరలించారు. ఇంకా అనేక చోట్ల అంగన్‌వాడీలను నిర్బంధించారు. పోలీసుల తోపులాటలో మోకాలికు దెబ్బతగిలిన అనంతపురం జిల్లా అధ్యక్షులు శకుంతలను ఆసుపత్రికి తరలించారు. ఉదయం 8 గంటలకే ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసును గొల్లపూడిలో, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని రామారావు, ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, కోశాధికారి బీవీవీ కొండలరావును పోలీసులు అరెస్టు చేసి భవానీపురం స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి పెద్దసంఖ్యలో అంగన్వాన్‌వాడీ కార్మికులు సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌కు చేరుకున్నారు. అలంకార్ కూడలి, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, బీసెంట్ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ధర్నా చౌక్ వైపు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అనేకచోట్ల ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అరెస్టు అయిన అంగన్వాడీలు ఆయా పోలీసుస్టేషన్‌ల వద్ద బైటాయించారు. కొన్నిచోట్ల పోలీసులతో తోపులాట కారణంగా కొంతమంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ఆందోళనలలో ఏఐటీయూసీకి చెందిన అంగన్‌వాడి నాయకులు జె.లలితమ్మ, ఎస్.మంజుల, ప్రేమ, సరోజమ్మ, నాగేశ్వరి, హెల్డా, శైలజ, శాంతి, అనురాధ, రేణుక, అంజమ్మతో పాటు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు సుబ్బరావమ్మ, బేబిరాణి, పోలారి, పి.ప్రసాద్, పద్మ, రవిచంద్ర తదితరులు నాయకత్వం వహించారు.

సీపీఐ, ఏఐటీయూసీ ఖండన

శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయటాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఉద్యమాల అణిచివేతే లక్ష్యంగా జగన్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాతంత్రవాదులు దీనిని ఖండించాలని కోరారు. దాసరి భవన్ సమీపంలో ఉన్న శంకరమఠం కళ్యాణమంటపంలో ఉంచిన అంగన్‌వాడీలను రామకృష్ణ, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. అంగన్వాడీ ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అణిచివేయాలని ప్రయత్నిస్తే, భవిష్యత్తులో తీవ్ర ఆందోళన తప్పదని, కార్మికుల ఆగ్రహాన్ని గ్రహించి రాష్ట్ర ప్రభుత్వం యూనియన్లతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమం తీవ్రరూపం దాలుస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పోలీసుల అణిచివేత చర్యలను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. భవానీపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఏఐటీయూసీ నాయకులు రవీంద్రనాథ్, ఓబులేసు, చలసాని రామారావు, ఎస్.వెంకటసుబ్బయ్య, కొండలరావును పరామర్శించి...సంఘీభావం తెలిపారు. ముప్పాళ్ల వెంట దోనేపూడి శంకర్, నగర నాయకులు ఉన్నారు. అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఏపీ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు కళ్లేపల్లి శైలజ తీవ్రంగా ఖండించారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చరమగీతం తప్పదు

చర్చాగోష్ఠిలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపితేనే ప్రజాస్వామ్యానికి మనుగడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మోదీ, జగన్ సర్కార్లపై తిరుగుబాటుకు ముందుకు రావాలని కార్మిక, కర్షక వర్గాలతో పాటు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు అధ్యక్షతన 'తెలుగోడా మేలుకో' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాల్సిన అవశ్యకతపై సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో చర్చా-గోష్ఠి జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ఆదాయం రెట్టింపు చేసి రైతుల ఆత్మహత్యలు నివారిస్తానని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగాన్ని పాలదోలతానని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ...ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. మోదీ సర్కారు దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల జీవనస్థితిగతులను దుర్భరంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రివర్గంలో ఒక్క ముస్లింకు స్థానం కల్పించలేదని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇటువంటి పరిస్థితి ఎన్నిడూ చూడలేదన్నారు. మోదీ నియంత పరిపాలన సాగిస్తున్నారని, ఒకవర్గం ప్రజలను తనకు అనుకూలంగా మార్చుకొని... రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని కలలు కంటున్నారని ఆరోపించారు. మోదీ తిరిగి అధికారం చేపడితే అంబేద్కర్ రాజ్యాంగాన్ని మూలనపడేస్తారని హెచ్చరించారు. భారత రాజ్యాంగం పీఠికలోని సోషలిజం, సెక్యులరిజం పదాలకు స్వస్తి పలికారని మండిపడ్డారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టారని ఆరోపించారు.

రాష్ట్రంలో జగన్ హయాంలో ర్యాలీలు, ధర్నాలు, సంఘీభావాలు, పరామర్శలకు అవకాశమే లభించడం లేదని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని భయోత్పాతం సృష్టిస్తున్నారని, అంగన్వాడీలు తలపెట్టిన ఆందోళనను ఉక్కుపాదంతో అణచివేశారని, అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇటువంటి ముఖ్యమంత్రిని, పిచ్చి ప్రభుత్వాన్ని ఇంతకుముందెన్నడూ చూడలేదని వ్యాఖ్యానించారు. చందబాబుకు సంఘీభావంగా రాజమండ్రి వెళుతున్న ఐటీ ఉద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారన్నారు. దుర్మార్గపు పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపాల్సిన అవసరం ఉందని చెప్పారు. వడ్డే శోభనాద్రీశ్వరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అరాచక, అవినీతికర, ప్రజాకంటక పాలన సాగుతోందని, అందుకే వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు అవసరమైన వ్యూహం, కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మాజీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను ఓడించాలని, తద్వారా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీకి అంగీకరించని మోదీ సర్కారు బడా బాబులకు, కార్పొరేట్ల శక్తులకు రూ.14.50 లక్షల కోట్ల బాకీలు మాఫీ చేసిందని ఆరోపించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న నాయకులపై కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు అరెస్టు జగన్ పిచ్చికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. మాజీ ప్రిన్సిపాల్ యన్.లక్షణారావు మాట్లాడుతూ రైతులు, సామాన్యుల నడ్డివిరిచే విద్యుత్ బిల్లు తీసుకురావడమే కాకుండా అదనంగా ట్రూ అప్ చార్జీలు వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రైతు నాయకులు చుండూరు రంగారావు, సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ప్రొఫెషనల్ ఫోరమ్ కన్వీనర్ నేతి మహేశ్వరావు, నాయకులు పి.మురళీకృష్ణ, అక్కినేని భవానీప్రసాదు, పాతూరు రవి, సీహెచ్ విజయలక్ష్మి, ఎం.ఉదయం భాస్కర్, వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వారంలోగా పెండింగ్ జీతాలు చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందడం లేదని ఎస్టీయూ ఆగ్రహం వ్యక్తంచేసింది. దాదాపు 30వేల మందికి నాలుగు నెలలుగా చెల్లింపులు జరగలేదని, పెండింగ్ జీతాలను వారంలో చెల్లించకపోతే రాష్ట్ర ఖజానా కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, మాజీ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్ బాబు హెచ్చరించారు. గుంటూరు ఎస్టీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. తిమ్మన్న మాట్లాడుతూ నాలుగు మాసాలుగా జీతాలు లేక ఉపాధ్యాయుల కుటుంబాలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, నెలసరి వాయిదాలు చెల్లించలేక బ్యాంకులకు జరిమానా కట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేసి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, పాత పింఛన్ విధానం పునరుద్ధరణ హామీలను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ నేతలు సుబ్బారెడ్డి, పాలడుగు ప్రసాదు, హనుమంతు, సాంబశివరావు, సురేశ్ పాల్గొన్నారు.

'దిశ'కు కేంద్రం కొర్రీ

పోస్కో చట్టం పేరుతో జాప్యం: హోంమంత్రి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని మహిళల భద్రత కోసం సీఎం జగన్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన దిశ బిల్లుకు చట్టంపై కేంద్ర ప్రభుత్వం కొర్రిలు పెడుతోందని హోంశాఖ మంత్రి తానేటి వనిత కీలక వ్యాఖ్యలు చేశారు. దిశ బిల్లు చట్ట రూపంలోకి రాకపోయినా, ఆ బిల్లులోని అంశాల్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంద న్నారు. శాసన మండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో మహిళల భద్రత, దిశ చట్టం అమలు తీరు తదితర అంశా లపై వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు, టీడీపీ సభ్యులు పి. అనురాధ, చిరంజీవి రావు, అశోక్ బాబు అడిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ మంత్రి పై విధంగా చెప్పారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో దిశ బిల్లుకు ఎంతో పేరొచ్చిందని, దానిని చట్టం కోసం కేంద్రానికి పంపి మూడేళ్లవు తున్నప్పటికీ ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. ఈ వ్యవ హారంలో అధికారుల వైఫల్యం కన్పిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో బిల్లు చట్టంగా ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. వరుదు కల్యాణి మాట్లాడుతూ ఇప్పటివరకు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారి వివరాలను తెలపాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు హోంమంత్రి తానేటి వనిత సమాధానం ఇస్తూ, మహిళలకు పటిష్టమైన భద్రత కల్పించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం ఈ బిల్లు తెచ్చిందన్నారు. దీని చట్టం కోసం కేంద్రానికి బిల్లులు పంపినప్పటికీ అనేక సవరణల పేరుతో కొర్రీలు వేస్తోందన్నారు. దిశ పేరు ఉండకూడదని, పోక్సో చట్టంలో ఉన్న కొన్ని అంశాలు సైతం దిశలోనూ ఉన్నాయని, రేప్ కేసుల్లో భాగంగా దిశ చట్టంలో పొందుపర్చిన అంశాలను కేంద్రం అంగీకరించడం లేదని వివరించారు. వాటితో పాటు దిశలో పొందుపర్చిన సోషల్ మీడియాలో మహిళలను కించపరిచే వారిపై కఠిన చర్యల అంశంలో సోషల్ మీడియా అనే పదం తొలగించాలని సూచిస్తోందని , ఈ తరహా కొర్రీలు వేయడంతోనే బిల్లు చట్టం అయ్యేందుకు అవరోధాలు ఎదురవుతున్నాయని చెప్పారు. పోస్కో, దిశ చట్టాలు వేర్వేరు అయినప్పటికీ, దిశ బిల్లు ఆమోదంపై కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. దిశ చట్టం అమలులో జాప్యం అయినప్పటికీ, తమ ప్రభుత్వం బిల్లులో పొందుపర్చిన అన్ని అంశాల్ని అమలు చేస్తోందని చెప్పారు. దిశ పోలీస్‌స్టేషన్లు, దిశ పెట్రోల్ వాహనాలతో మహిళలకు నిరంతరం భద్రతా చర్యల్ని పెంచామన్నారు. 24 గంటలూ దిశ పోలీస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయని, దిశ యాప్ ద్వారా బాధితులు ధైర్యంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు కోటి 43 లక్షల మంది నమోదు చేసుకున్నారని, వారిలో పది లక్షల 50వేల మంది వినియోగించుకున్నారని వివరిం చారు. ఇప్పటివరకు 1500 మంది పోలీసుల సాయంతో రక్షణ పొందారని, ప్రజలంతా ఈ దిశ బిల్లు చట్ట రూపంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం తరపున కేంద్ర హోంశాఖ మంత్రితో మళ్లీ సంప్రదింపులు చేపట్టి, దిశ చట్టానికి ప్రయత్నిస్తామన్నారు.

సఫాయి కార్మికుల సేవలు వెలకట్టలేం

పంచాయితీ రాజ్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజశేఖర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధిని సాధించడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ గొప్పదని పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల కృషిని, త్యాగాలను గుర్తిస్తూ వారి సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. సోమవారం తాడేపల్లిలో జరిగిన పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ సఫాయి కార్మికులంతా వేకువజామునే పల్లెల్లో, పట్టణాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తూ. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి. డంపింగ్ యార్డుకు చేరవేసి స్వచ్ఛతలో భాగస్వాములవుతున్నారని చెప్పారు.ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర వెలకట్టలేని దన్నారు. పారిశుద్ధ్య కార్మికులు లేనిదే సమాజం మునగడ లేదని వీరు చేస్తున్న సమాజసేవ భగవంతుడు ఇచ్చిన వరమని ఆయన కొనియాడారు. సఫాయి కార్మికుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించి సమాజంలో అందరితో సమానంగా జీవించేటట్టుగా ప్రజలందరి ఆలోచనలో మార్పురావాల్సిన అవసరముం దన్నారు. రాష్ట్రంలోని సఫాయి కార్మికుల సంక్షేమ పథకాల రూపకల్పనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిమగ్నమై ఉందని వెల్లడించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా భీమడోలులో ప్రారంభమైన కాఫీవిత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ, సఫాయి కార్మికుల పిల్లల భవిష్యత్తు కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సఫాయి కార్మికుల పిల్లలు అదే వృత్తిలో కొనసాగకుండా ఉన్నత చదువులు చదివే విధంగా చేయాలన్నదే తమ కార్పొరేషన్ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మిక సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సఫాయి కర్మచారి ఆందోళన్ నిర్వాహకులు బెజవాడ విల్సన్ మాట్లాడుతూ సమాజంలో లోపాలు, హెచ్చు తగ్గులవల్ల కుల వ్యవస్థ జాడ్యం ఇంకా పట్టిపీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులంటే ఒక కులానికి చెందిన వారే అన్న భావన ఉండడం వల్లే సమాజంలో రుగ్మతలు ఏర్పడుతున్నాయన్నారు. సఫాయి కార్మికులను కూడా అందరితో సమానంగా చూసినప్పుడే సమాజం పరిఢవిల్లుతుందని విల్సన్ చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ఎండీ చిన్నరాముడు, పంచాయితీరాజ్ అదనపు కమిషనర్ సుధాకర్, సఫాయి కర్మచారి ఆందోళన్ ప్రతినిధి దీప్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 84 సఫాయి కార్మికులను సత్కరించారు.

చిరస్మరణీయుడు సూర్యదేవర

సంస్మరణ సభలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-నందిగామ: విద్యార్థి దశలో కమ్యూనిస్టు ఉద్యమంలో అడుగుపెట్టి కార్యకర్త స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎదిగి... సమర్ధ వంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన మహనీయుడు సూర్యదేవర నాగేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. సూర్యదేవర నాగేశ్వరరావు 8వ సంస్మరణ సభ రైతుపేటలోని సీఆర్ భవన్‌లో సోమవారం జరిగింది. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని సీఆర్ భవన్ నుండి జాతీయరహదారి మీదుగా గాంధీ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఆర్ భవన్ వద్ద సూర్యదేవర నాగేశ్వరరావు విగ్రహానికి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రెటరీ దోనేపూడి శంకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి వల్లంకొండ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ముప్పాళ్ల మాట్లాడారు. తొలితరం కమ్యూనిస్టు నాయకులతో కలిసి భూ పోరాటాలలో అడుగులేసిన ఆదర్శ కమ్యూనిస్టు సూర్యదేవర అని, నేటితరం యువతలోనూ ఆయన ఉద్యమ స్ఫూర్తి రగిలించారని ముప్పాళ్ల చెప్పారు. యువకులు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా ఆయన పనిచేశారని, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సత్సం బంధాలు కొనసాగించారని గుర్తుచేశారు. ప్రశ్నించడాన్ని జగన్ ప్రభుత్వం భరించలేకపోతోందని ముప్పాళ్ల విమర్శించారు. పోలీసు యాక్ట్ పేరుతో అడుగడుగునా నిర్బంధం, అణచివేత చర్యలు కొనసాగిస్తోందని మండి పడ్డారు. జగన్ అరాచక పాలన వెనుక ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నారని చెప్పారు. పాలకుల అనాలోచిత విధానాలతో కోట్లాదిమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోపిడీకి గురవుతున్నారని ముప్పాళ్ల ఆరోపించారు. మోదీ, అమిత్ షా చేతుల్లో దేశం బందీ అయిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందన్నారు. కమ్యూ నిస్టు పార్టీని ముందుకు తీసుకువెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అక్కినేని వనజ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన కమ్యూనిస్టు యోధుడు సూర్యదేవర నాగేశ్వరరావు అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సారథ్యంలో బస్సుయాత్ర సాగిన విషయాన్ని గుర్తుచేశారు. మోదీ సర్కారు ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా నష్టం చేసిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయడంలో మోదీ, జగన్ సర్కార్లు పూర్తిగా విఫలమయ్యా యన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దోనెపూడి శంకర్ మాట్లాడుతూ పేదల కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం అంకితభావంతో పనిచేసిన మహోన్నతుడు సూర్యదేవర నాగేశ్వరరావు అని నివాళి అర్పించారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ కృష్ణాజిల్లా సహాయక కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ మాట్లాడుతూ గొప్ప మనసున్న మహా నాయకుడు సూర్యదేవర అని, ఆయన ఆశయ సాధనకు పునరంకితమవుదామని పిలుపు నిచ్చారు. సీపీఐ సీనియర్ నాయకులు మన్నెం నారాయణరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, సహాయ కార్యదర్శి కట్టా చామంతి, నాయకులు కె.నాగ భూషణం, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, సహాయ కార్యదర్శి వేముల వీరయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఎం.ప్రకాశరావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

సీఎంతో చర్చించాకే నిర్ణయిస్తాం

చేనేతల పింఛన్‌పై గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చేనేత రంగ కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించామని, మగ్గానికి సంబంధం లేకుండా నాలుగు రకాల కార్మికులకు నేతన్న నేస్తం అమలుపై సీఎం జగన్‌తో చర్చించిన తర్వాత నిర్ణయిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. శాసన మండలిలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో భాగంగా చేనేత రంగ సమస్యల్ని సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ, చేనేత మగ్గానికి అనుబంధంగా ఉండే మరో నాలుగు రకాల వృత్తులకు పింఛన్ కల్పించాలన్నారు. చేనేత రంగానికి దోహదపడేలా ఆప్కో పరిశ్రమను సంస్కరించాలని, నేతన్న నేస్తం ద్వారా కార్మికులు నేచిన వస్త్రాలను ఆప్కో ద్వారా విక్రయించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, రాజేంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. చేనేత కళలు, సంస్కృతి పరిరక్షణకు 11 రకాలపై చట్టాలు చేశారన్నారు. చేనేత రంగానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మంగళగిరిలో వేలాదిమంది చేనేత కార్మికులు ఉన్నారని, నేతన్న నేస్తం పథకం ప్రయోజనాలు అర్హులందరికీ అందడం లేదని చెప్పారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి అమర్‌నాథ్ సమాధానాలిచ్చారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పింఛన్‌పై సంయుక్త డైరెక్టర్ కార్యాలయం నిర్లక్ష్యం చేస్తోందనే అంశాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చారు. ఆప్కోకు చెందిన ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లోనూ ప్రవేశానికి కృషి చేస్తామన్నారు. చేనేత రంగ బలోపేతంపై సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామనితెలిపారు. లక్షా60వేల మంది చేనేత రంగంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. చేనేత రంగంలో ఓనర్‌షిప్ ఉన్నవారికి నేతన్న నేస్తం ఇస్తున్నామని, ఇప్పటి వరకు ఐదు విడతలుగా ఇచ్చామన్నారు. ప్రైవేట్ చేనేత కార్మికుల ఉత్పత్తుల్ని లేపాక్షికి విక్రయించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

తిరుపతి కాలిబాటలో భద్రతా చర్యలు: కొట్టు సత్యనారాయణ

తిరుమల తిరుపతి దేవస్థానం కాలిబాటలో భద్రతా చర్యలు చేపట్టామని ఉప ముఖ్యమంత్రి (దేవాదాయశాఖ) కొట్టు సత్యనారాయణ వెల్లడిం చారు. శాసన మండలిలో సభ్యులు రామారావు, అనురాధా, తిరుమలనాయుడు, తోట త్రిమూర్తులు తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానా లిచ్చారు. కాలిబాటకు ఇరువైపులా విద్యుత్ దీపాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిరుతల దాడుల దృష్ట్యా టీటీడీ ఆర్థిక సాయంతో రెస్క్యూ పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. జింకల కోసం వేసే శాఖాహార ఆహారాన్ని ఘాట్ రోడ్‌లో నిషేధించామని చెప్పారు. జింకల కోసం చిరుతలు వచ్చి దాడులు చేయడం వల్ల ఈ చర్యలు చేపట్టామన్నారు.

దేవాలయాల భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొలుత ప్రశ్నోత్తరాలలో తిరుపతి దర్శన వీఐపీ టికెట్ల కేటాయింపులో ఎమ్మెల్సీలపై వివక్ష గురించి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ప్రస్తావించారు. ఎమ్మెల్యేలకు అధిక ప్రాధాన్యతిచ్చి, ఎమ్మెల్సీలను విస్మరించడం తగదన్నారు. కొందరు అధికారుల నిర్లక్ష్యంతోనే టీటీడీ బస్సుల అదుపు తప్పుతున్నాయన్నారు. ఎమ్మెల్సీల విషయంలో అలసత్వం తగదని అన్నారు. ఇదే అంశంపై పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కూడా మాట్లాడారు. తిరుపతి దర్శన టికెట్ల విషయంలో ఎమ్మెల్యేలకు కల్పించిన హక్కులను ఎమ్మెల్సీలకూ కల్పించాలని ఆయన కోరారు.

నవరత్నాల ద్వారా పేదలందరికీ ఇళ్లు: జోగి రమేశ్

నవరత్నాల ద్వారా పేదలందరికీ ఇళ్లు ఇవ్వడం చారిత్రకమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఇప్పటివరకు 33 లక్షల ఇళ్లు అక్కాచెల్లెళ్లకు కేటాయించినట్లు తెలిపారు. సభ్యుల ప్రశ్నలకు బదులిస్తూ 21,75,820 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలే కాకుండా, నిర్మాణాలకూ శ్రీకారం చుట్టామన్నారు. విద్యుత్, తాగునీరు, రహదారుల సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆరు లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగాయన్నారు. మన్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను నిర్మించడంపై దృష్టి పెడతామని అన్నారు. కైకలూరులో కో-ఆపరేటివ్ బ్యాంకులతో అదనంగా రుణాలను లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేందుకు, భీమవరంలోని ఇళ్ల సమస్యల్ని పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీలు జయమంగళ వెంకట రమణ, ఇందుకూరి రఘురాజు, కేఎస్ లక్ష్మణరావు తదితరులు వివిధ అంశాలను మంత్రి రమేశ్ దృష్టి తీసుకెళ్లారు. ప్రత్యేక ప్రస్తావన (స్పెషల్ మెన్షన్) కింద వివిధ అంశాల్ని చైర్మన్‌కు సభ్యులు తెలియజేశారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన 6,500 మందిలో 4,072 మందికే ఉద్యోగాలిచ్చారని, మిగితావారికి అవకాశాలు ఇవ్వాలని సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. విజయనగరం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టాలని సభ్యుడు రఘు వర్మ కోరారు. అనంతరం వివిధ కీలక బిల్లులను శాసనమండలి ఆమోదించింది.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

- గ్రాట్యువిటీ అమలుకు చర్యలు తీసుకోవాలి
- మండలిలో పీడీఎఫ్ సభ్యుల వాయిదా తీర్మానం తిరస్కృతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, వారికి వేతనాల నుంచి ఉద్యోగ ప్రయోజనాల కల్పనలో అడుగడుగునా అన్యాయం జరుగుతోందని పీడీఎఫ్ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సబ్జీ సోమవారం శాసనమండలిలో ఆందోళన వ్యక్తం చేశారు. సభ ప్రారంభం కాగానే అంగన్‌వాడీ వర్కర్ల పదవీ విరమణ సమయంలో గ్రాట్యువిటీ చెల్లింపుపై పీడీఎఫ్ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తిరస్కరించారు. అనంతరం ప్రశ్నోత్తరాలను చేపట్టారు. పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు గ్రాట్యువిటీ ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కర్నాటక తదితర రాష్ట్రాల్లో సుప్రీం తీర్పు అమలుకు శ్రీకారం చుట్టాయని గుర్తుచేశారు. రాష్ట్రంలోనూ అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాట్యువిటీ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 35 ఏళ్లపాటు అంగన్‌వాడీలు పనిచేసి, వారి ఉద్యోగం ముగిశాక గ్రాట్యువిటీ లేనందున తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. సభ్యుడు ఇళ్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో తెలంగాణ కంటే ఏపీలో అంగన్‌వాడీలకు ప్రయోజనాలు అధికంగా కల్పిస్తామని సీఎం జగన్ చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీలకు వేతనాల పెంపు హామీని నిలుపుకోలేక పోయింద న్నారు. రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు.

వైసీపీ సభ్యుడు మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు ముఖ గుర్తింపు ఆధారిత యాప్‌తో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఈ ప్రభుత్వ హయాంలో ఎంత మందికి ప్రయోజనం కల్పించారనేదీ సమగ్రంగా వివరించాలన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను 90శాతానికిపైగా అమలు చేశారన్నారు. వైసీపీ సభ్యులు వరుదు కల్యాణి, పోతుల సునీత, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం సీఎం జగన్ చేస్తున్న చర్యలు ఎంతో ఆదర్శనీయమని, గతంలో ఏ సీఎం చేయనంతగా ఆయన కృషి చేశారని వివరించారు.

ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టినా అందులో మహిళలే లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. మహిళల రక్షణ కోసం దిశ చట్టం, దిశా యాప్ తీసుకొచ్చారని వివరించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాలు అమలు చేస్తున్న వివరాలు తెలపాలని కోరారు.

మహిళా సాధికారతకు పెద్దపీట: ఉష్రశ్రీ చరణ్

కేంద్ర ప్రభుత్వం తాజాగా మహిళా బిల్లుకు చట్టం చేసినప్పటికీ, రాష్ట్రంలో మూడేళ్ల క్రితమే మహిళా సాధికార తకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని మహిళా భివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉష్రశ్రీ చరణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు పెద్దపీట వేశారని వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లకు ముఖ ఆధారిత యాప్ ఇబ్బందుల సమస్యలపై పరిశీలిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లలో వాటి అప్‌లోడ్‌కు చర్యలు తీసుకుంటు న్నామని సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. సీఎం జగన్ ఎంతో చిత్తశుద్ధితో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. వైఎస్ఆర్ సంపూర్ణ పౌష్టికాహార పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. వారికి గ్రాట్యువిటీ అంశాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

మహిళా బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి ఏది?

ఏఐసీసీ అధికార ప్రతినిధి పంకూరి పథక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లు రాజకీయ లబ్ది కోసమేనని ఏఐసీసీ అధికార ప్రతినిధి పంకూరి పథక్ విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుతో కలసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. పంకూరి పథక్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కేంద్రం మహిళా బిల్లును తీసుకువచ్చిందని, బిల్లుపై బీజేపీ ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి లేదన్నారు. 1989లో ప్రధానిగా రాజీవ్ గాంధీ ఉన్నప్పుడే దేశంలో మొదటి సారి కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును సభలో ప్రవేశ పెట్టగా, బీజేపీకి చెందిన అద్వానీ, వాజ్‌పేయ్, యశ్వంత్ సింగ్, రామ్ జత్మలానీ వంటి నేతలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారని గుర్తు చేశారు. తదనంతరం 1992లో కాంగ్రెస్ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. 2011-12 కాంగ్రెస్ హయాంలో జరిగిన జన గణన లెక్కల్ని ఇంతవరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బయట పెట్టలేదన్నారు. ఎన్నికల ముందు బిల్లు ఆమోదింప చేయడమే కాకుండా, 2029 వరకు అమలు ఉండదని చెప్పడం మహిళ పట్ల, రిజర్వేషన్ల పట్ల బీజేపీ చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. మణిపూర్ నరమేధాన్ని సైతం బీజేపీ నాయకులు తప్పుపట్టక పోవడంతో పాటు మహిళలకు సంబంధించిన నేరాల్లో ఉన్న నిందితులకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ము కాస్తున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహా రావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు లాం తాంతియా కుమారి, కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీతో పాటు సీనియర్ నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మత్స్యకార సంఘం చైర్మన్‌గా జగన్నాథం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మత్స్యకార సంఘం రాష్ట్ర చైర్మన్‌గా విశాఖపట్నానికి చెందిన కె జగన్నాథాన్ని నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్ లో సోమవారం నియామక ఉత్తర్వులను రుద్రరాజు చేతుల మీదుగా జగన్నాథం అందుకున్నారు. ఫిషర్‌మెన్ కమ్యూనిటీ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని జగన్నాథం చెప్పారు.

సంపాదకీయం

అసలు-నకిలీ

వచ్చే సంవత్సరం జరగనున్న ఎన్నికలలో మళ్లీ బీజేపీ విజయంసాధిస్తే ప్రధానమంత్రి ఎవరు అవుతారన్న చర్చకు స్థానమేలేదు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితినిబట్టి చూస్తే 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రధానమైన పోటీ బీజేపీకి, ప్రతిపక్షాల ఐక్య సంఘటన అయిన "ఇండియా" కు మధ్యే ఉంటుంది. ఆ "ఇండియా" తరపు ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరు అన్నది ఇంకా అధికారికంగా నిర్ణయించలేదు. ఈ ఐక్య సంఘటనలో కాంగ్రెస్ అతి పెద్ద రాజకీయ పక్షం. దేశమంతా ప్రాతినిధ్యం ఉన్న పక్షం అదే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే అయినా రాహుల్ గాంధీకి వస్తున్న ప్రచారం ఖడ్గేకు లేదు. భారత్ జోడో యాత్ర బ్రహ్మాండమైన విజయం సాధించి, రాహుల్ గణనీయమైన నాయకుడిగా ఎదుగుతున్నట్టు కనిపిస్తున్నా రాహుల్ వ్యవహరిస్తున్న తీరూ తానే నాయకుడినన్న రీతిలో లేదు. కానీ సర్వత్రా ఆయనే కనిపిస్తున్నారు. మోదీ సర్కారును బోనులో నిలబెట్టడంలో రాహుల్ పేరు చెప్పిన తరవాతే మరెవరి పేరైనా చెప్పాలి. ప్రస్తుత లోకసభలో కాంగ్రెస్‌కు ఉన్న బలం చాలా తక్కువే కావచ్చు. కానీ పార్లమెంటులో ప్రధానమైన అంశాలు లేవనెత్తవలసిన అవకాశం వచ్చినప్పుడల్లా రాహుల్ ముందు వరసలో ఉంటున్నారు. మోదీని ఢీ కొనగలిగిన నాయకుడు ఆయనే అన్న అభిప్రాయం సర్వత్రా ఏర్పడుతోంది. ఎన్నికల తరవాత పరిస్థితి ఏమిటి అన్న అంశాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టినా రెండు ప్రధాన పక్షాలకు ఇద్దరు నాయకులే ప్రముఖంగా కనిపిస్తున్నారు. బీజేపీకి తిరుగులేని నాయకుడిగా మోదీ గత పదేళ్ల నుంచి కొనసాగుతున్నారు. అదే పద్ధతిలో ప్రతిపక్షం తరఫున మోదీకి సరితూగే నాయకుడు రాహుల్ గాంధీయేనన్న అభిప్రాయమూ నానాటికీ బలపడుతోంది. ఈ ఇద్దరూ 2024 ఎన్నికలలో ఢీకొనడానికి తమ పరివారాలను సిద్ధం చేస్తున్నారు. సంవాదాలు వారిద్దరి మధ్య జరుగుతున్నాయి. రాహుల్ గాంధీ ఇటీవలి కాలం దాకా రాజకీయాలు అంటే తీరిక ఉన్నప్పుడో, ఏ పనీ లేనప్పుడో నిర్వహించే కార్యకలాపం అన్నరీతిలో మెలిగే వారు. నిరాసక్త రాజకీయ నాయకుడిగా కనిపించేవారు. ఇలాంటి వ్యక్తి ప్రత్యర్థి పక్షనాయకుడైతే ఆ వ్యక్తి మీద దాడి చేయడం సులభం అని బీజేపీ భావించింది. కానీ భారత్ జోడో యాత్ర తరవాత రాహుల్‌కు జనాదరణ పెరిగింది. రాహుల్ కూడా రాజకీయాలలో నిర్విరామంగా పాల్గొంటున్నారు. దానికి తోడు గుర్తించదగిన పరిపక్వత ఆయనలో కనిపిస్తోంది. బీజేపీకి మాటకు మాట సమాధానం ఇచ్చే నాయకుడిగా ఎదిగారు.

నిరంతరం ఎన్నికల ధ్యాసలోనే ఉండే మోదీ అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టి నెలలు గడుస్తోంది. నియత పద్ధతిలో ఆయన ఆ రాష్ట్రాలలో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చేతికి ఎముకలేనట్టుగా హామీలు గుప్పిస్తున్నారు. కానీ ఆయన సభలకు జనం పలచగా హాజరవుతున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జనం లేక అసలు సభలకే హాజరు కాకుండా అమిత్ షా వెనుదిరిగిన సందర్భాలూ ఉన్నాయి. నిద్రలో కూడా ఎన్నికల తలపులు వదలని అసత్య ప్రచార ధోరణిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రానికి వేలకోట్ల పథకాలు ప్రకటిస్తున్నారు. పదే పదే అబద్ధాలాడితే జనం అదే నిజమని నమ్ముతారన్న ధర్మసూక్ష్మాన్ని మోదీ హిట్లర్ దగ్గరనుంచి అలవర్చుకున్నారు. ఉదాహరణకు సోమవారం మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ర్యాలీలో మోదీ భోపాల్‌లో దుర్గావతి రైల్వేస్టేషన్ అత్యంత ఆదరణ పొందుతోందని వెనుకా ముందు చూడకుండా అనేశారు. భోపాల్‌లో అలాంటి రైల్వేస్టేషనే లేదు. అసలు భారతీయ రైల్వేలలో ఎక్కడా ఆ పేరున్న స్టేషన్ లేదు. ఆయన ప్రస్తావించిన రైల్వే స్టేషన్‌కు సామ్యం ఉన్న రాణి కమలాపతి స్టేషన్ మాత్రంఉంది. అలాగే దర్భంగాలో అఖిల భారత వైద్య విధానసంస్థ (ఎయిమ్స్) ఏర్పాటు చేసిన ఘనత తమదేనని చెప్పుకున్నారు. ఈ మాట విని ఆ ప్రాంత ప్రజలే ముక్కున వేలేసుకుంటున్నారు. మోదీ గ్యారంటీ ఇస్తే అది అమలై తీరుతుందని గుండె మీద చేయి వేసుకుని నిబ్బరంగా అబద్ధమాడుతున్నారు. తొమ్మిదేళ్లుగా విని విని విసిగిపోయిన జనం ఈ అబద్ధాలను ఎండగడ్తున్నారు. వంద రోజుల్లో నల్లధనం వెనక్కు తెచ్చి ప్రతి కుటుంబానికి 15లక్షలు వారి ఖాతాలోకి వేస్తానని, రూ.35కే లీటర్ పెట్రోల్, డీసెల్, 2022 నాటికి 100 అధునాతన నగరాలు (స్మార్ట్ సిటీలు), అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, చౌకగా గ్యాస్ సిలిండర్, 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ, రైతుల ఆదాయం రెట్టింపు, ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అన్న హామీలు ఏమైనాయని నిలదీస్తున్నారు. గంగానది ప్రక్షాళనకోసం ఏకంగా ఓ మంత్రిత్వ శాఖను, ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల ఆ శాఖ మంత్రిగా ఉన్న ఉమా భారతి ఇప్పుడు బీజేపీమీద కారాలు మిరియాలు నూరుతున్నారు. తాజాగా తమిళనాడులో అన్నా డీఎంకె మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. కూటమితో తెగ దెంపులు చేసుకుంది. గత అయిదేళ్ల కాలంలో అకాలీ దళ్, బిజూ జనతా దళ్ లాంటివి ఎన్.డి.ఎ. నుంచి బయటికి వచ్చేశాయి. ఇవన్నీ మోదీ మూటగట్టుకున్న వ్యతిరేకతకు రుజువులే. మరో వేపు రాహుల్ గాంధీ సరికొత్త పద్ధతిలో సామాన్య జనానికి చేరువ కావడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన లారీలెక్కి స్కూటర్లెక్కి ప్రయాణిస్తున్నారు. ధాబాల్లో జనంతో కలిసి భోంచేస్తున్నారు. సామాన్యుల ఆతిథ్యం స్వీకరిస్తున్నారు. మోటార్ సైకిల్ మెకానిక్కులతో కలిసి మరమ్మతులు చేశారు. పిల్లలతో కలిసి క్రికెట్ ఆడతారు. రాహుల్ ఎవరితో కలిసిపోయినట్టు నిరూపిం చడానికి ప్రయత్నిస్తున్నారో ఆ వర్గాల వారందరూ వెనుకబడినవారే. పేదలే. మోదీ కూడా తాను వెనుకబడిన తరగతులవాడినని చెప్పుకోవడానికి నానా తంటాలు పడ్తున్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తరవాతే ఆయన సామాజిక వర్గాన్ని వెనుకబడిన వర్గాల జాబితాలో చేర్చారు.

అన్నింటికన్నా మించి రాహుల్ గాంధీ గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పొరపాట్లను నిర్మొహమాటంగా అంగీకరిస్తున్నారు. 2010లో యు.పి.ఎ హయాంలో మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీలను చేర్చకపోవడం వంద శాతం పొరపాటేనని జంకు లేకుండా ఒప్పేసుకున్నారు. పేదల పక్షాన నిలబడడానికి నాయకులు ఆ వర్గానికి చెందిన వారే కానక్కర్లేదు. మండల్ నివేదిక దుమ్ము దుల్పిన విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, అందరికన్నా ముందు అమలుచేసి చూపిన అర్జున్ సింగ్ వెనుకబడిన తరగతుల వారు కాదు. రాహుల్ కూడా అంతే. అనువైనప్పుడు తాను జంధ్యం వేసుకునే బ్రాహ్మణుడిని అని చెప్పుకున్న వారే. రాహుల్ ప్రస్తుత ధోరణిలో ఎంతో కొంత నిజాయితీ కనిపిస్తోంది. నిరంతరత కొట్టొచ్చినట్టుగా ఉంది. రాహుల్ దీ ప్రచారార్భటం అని కొట్టి పారేయడం సులభమే. కానీ ఆయన నడవడిక కచ్చితంగా సామాన్యుల, పేదల చైతన్యస్థాయి పెంచడానికి తోడ్పడుతోంది. రెండు పక్షాల ఇద్దరు అగ్ర నాయకుల నడవడికలోని పస ఏమిటో తేలిపోతోంది. ఎవరు అసలీనో, ఎవరు నకిలీనో తేల్చే కాలం ముందుంది.

చలసాని వెంకటరామారావు

మేకవన్నె పులులను సాగనంపండి

జెరుసలేం నగరానికి 'సిటి ఆఫ్ గాడ్' అని పేరు. దీనికోసం ముస్లింలు, క్రైస్తవులు, యూదులు 200 సంవత్సరాలపాటు 'పవిత్ర' యుద్ధం చేశారు. మతం మత్తులో జరిగిన ఈ యుద్ధాలనే 'క్రూసేడ్'లు అంటారు. క్రైస్తవులకు, ముస్లింలకు మధ్య జరిగిన ఈ ఒప్పందం మేరకు 1192లోఈ యుద్ధాలు ముగిశాయి. క్రైస్తవులు జెరుసలేంలోని 'పవిత్ర' స్థలాలను సందర్శించే హక్కును పొందారు. ఈ మత యుద్ధాలతో ఆసియా, ఐరోపా దేశాల సంస్కృతిలో పెద్ద మార్పువచ్చింది. ఐరోపా దేశం ఎన్నో విలువైన గుణపాఠాలను, కొత్త విషయాలను నేర్చుకుంది. జెరుసలేం ఆక్రమణ సందర్భంగా 'సరాసన్' జాతివారు తమ విజయచిహ్నంగా "హిప్ హిప్ హుర్రే" అనే అరబ్బు పదాన్ని ఉచ్చరించారు. ఇప్పటికీ ఈ పదం విజయచిహ్నంగా అనేక దేశాలలో వినియోగిస్తున్నారు. 1212లో కాన్‌స్టాంటినోపుల్ ఆక్రమణతో లాటిన్ రాజ్యస్థాపన జరిగింది. అప్పుడు అతి దారుణమైన "చిల్డ్రన్ క్రూసేడ్" జరిగింది. అరబ్ దేశానికి చెందిన చిన్నారులను బందీలుగా పట్టుకుని బానిసలుగాచేసి క్రూరాతి క్రూరంగా హింసించేవారు. మధ్య యుగాలలో జరిగిన ఈ అరబ్బుల-ముస్లింల మధ్యయుద్ధాలు మానవజాతికి మచ్చతెచ్చాయి. ఫ్రాన్స్, స్పెయిన్, టర్కీ దేశాల మధ్య దేవునికోసం యుద్ధాలు జరిగాయి. ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య నేటికీ రావణకాష్టం రగులుతూనే ఉంది. రోమన్‌లకు, యూదులకు కూడా యుద్ధాలు జరిగాయి. క్రైస్తవులు, ముస్లింలు, యూదులు ఈ మతయుద్ధాలలో పాల్గొన్నారు. అసంఖ్యాకంగా మానవహననం జరిగింది. ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలోను నేడు మతం ప్రముఖపాత్ర వహిస్తున్నది. కొందరు నియంతలు మతాన్ని, జాతిని తమ స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం వినియోగిస్తున్నారు. విద్వేష రాజకీయాలను ప్రేరేపించి ప్రజలమధ్య ముఖ్యంగా మతం పేరుతో మంటలు రాజేసి చలికాసుకుని ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. కానీ విషబీజాలు నాటినవారు వాటిఫలాలను అనుభవించక తప్పదు. విద్వేష రాజకీయాలు చేసేవారు ఆ విద్వేషానికి బలికాక తప్పదు. విద్వేష రాజకీయాలు చేసేవారు ఆ విద్వేషానికి బలికాక తప్పదు. ఇది చరిత్ర నేర్పిన సత్యం. ఇది గ్రహించని భారతదేశ పాలకులు మతం ఆధారంగా పాలన సాగించాలనీ, రాజకీయ ప్రయోజనాలు ఆశించి పనిచేస్తున్నారు. ప్రజాస్వామ్య రాజకీయాలలో మతం పాత్ర ఎంత ప్రమాదకరమో భారత ఉపఖండంలోని వివిధ దేశాల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి.

మతాలపేరుతో చిచ్చుపెడితే అది రగులుకున్నంతకాలం వరకు తమ అధికారానికి ఢోకా ఉండదు. ఇది శ్రీలంక అనుభవం. అక్కడ రాజపక్సా సోదరుల పాలనలో మతం పేరుతో ప్రజలను పీడించారు. 'బోదు బాల సేన" పేరుతో స్వంత మత సైన్యం రూపొందించి ముస్లింలమీద దాడులకు తెగబడ్డారు. అవినీతి, అరాచకం అక్కడ రాజ్యమేలింది. అదేమని ఎదురు మాట్లాడితే రాజద్రోహం నేరం మోపి పలువురిని జైలుపాలు చేశారు. బెదిరింపులు, హత్యలకు అదుపులేకుండా పోయింది. ప్రజలలో తీవ్ర అసంతృప్తి వెల్లువలో ఎన్నికలు జరిగితే, విజయం సాధించలేమని సైనిక

తిరుగుబాటుకు ప్రయత్నించారు. అధ్యక్షుడు 'గొటబయ' ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడు. మాటల గారడీ ప్రదర్శించాడు. ఇష్టారాజ్యంగా నిర్ణయాలుచేసి 'అయినవాళ్లకు ఆకుల్లో కానివాళ్లకు కంచాల్లో' లాగా పాలన సాగించాడు. ప్రజలు దుర్భర దారిద్ర్యం అనుభవించారు. తలసరి ఆదాయం తల్లక్రిందులై ప్రజలు అల్లాడిపోయారు. "శ్రీలంక పెరుమన పోదు" పేరుతో స్వంతపార్టీ పెట్టి పార్టీని, పార్లమెటును తన చేతల్లో పెట్టుకుని 'ఆడిందే ఆట పాడిందే పాట' గా వ్యవహరించారు. అర్థరాత్రి నిర్ణయాలతో ప్రజల సహనానికి పరీక్షపెట్టారు. దీనితో ప్రజలు అష్టకష్టాలు అనుభవించారు. ఆహారసంక్షోభం వచ్చింది. రసాయన ఎరువుల నిషేధంతో వ్యవసాయ వస్తువుల ఉత్పత్తి దిగజారింది. ధరలు ఆకాశాన్ని అంటాయి. దీనితో ప్రజలు తిరగబడ్డారు. సోదరులు దేశం విడిచి పరారయ్యారు. నియంతలుగాఉండి పాలన చేసేవారు ప్రజలను పావులుగా వాడుకుని పబ్బం గడుపుకుంటారేగాని ప్రజలను పట్టించుకోరు. ప్రజల ఆకలి, కన్నీళ్లు, కష్టాలు పట్టించుకోరు. ఇదే తరహా ప్రజాస్వామ్యం నేడు భారతదేశంలోనూ సాగుతున్నది. ఇటలీ నియంత ముస్సోలినీ, జర్మన్ నియంత హిట్లర్ ఎలా వ్యవహరించారు. వారి కథ ఎలా ముగిసింది చరిత్రలో మనకు తెలుసు. ముస్సోలిని మాటలునమ్మి అధికారం అప్పగించిన ప్రజలే చివరకు కాల్చిచంపి శవాన్ని తలక్రిందులుగా వేలాడదీసి చెప్పులతో కొట్టి చావు తర్వాత కూడా ఘోర అవమానానికి గురిచేశారు. రొమేనియా నియంతం 'సూసెస్కూ'ను ప్రజలు చేతులు వెనక్కు విరగదీసి కట్టి కాల్చివేస్తుంటే బేలగా మరణిస్తున్నానని దు:ఖించిన దృశ్యం నియంతలు చివరకు ఎలా తనువు చాలించింది తెలియజేస్తుంది. పాకిస్తాన్‌లో నియంతగా వ్యవహరించిన ముషారఫ్ జైలుపాలై భయంతో జీవిస్తున్న పరిస్థితి మనం చూస్తున్నాం. తనకు నచ్చని దానిని ధ్వంసం చేయటమే సిద్ధాంతంగా పెట్టుకుని మానవ హననానికి పాల్పడిన జర్మన్ నియంత హిట్లర్ జాత్యహంకారంతో మారణహోమం సృష్టించారు. యూదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు శత్రువులుగా భావించి ఫాసిస్టుగా మారాడు. జర్మనీ జాత్యహంకారాన్ని ప్రకటించి నియంతగా పాలించి ప్రపంచాన్ని తన పాదాక్రాంతం చేసుకోవాలని ప్రయత్నించాడు. తన ప్రియురాలితోకలిసి ఒక నేలమాళిగలో ఆత్మహత్య చేసుకున్నాడు.

విషబీజాలను నాటినవారు వాటి ఫలితం అనుభవించక తప్పదు. విద్వేష రాజకీయాలు సృష్టించినవారు ఆ విద్వేషానికీ గురికాక తప్పదు. నియంతలు ప్రజలను భ్రమల్లో జీవింపచేస్తారు. నేటి వర్తమాన భారత ప్రజాస్వామ్యపాలన దీనికి ఏ మాత్రం భిన్నంగాలేదు.

గత దశాబ్దికాలంగా భారతదేశ పాలన సాగిస్తున్న నరేంద్రమోదీ పాలనావిధానం పైఘటనలకు ఏ మాత్రం భిన్నంగా లేదు. మతంపేరుతో ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భుజానవేసుకున్నాయి. దేశంలో ప్రార్థనా ప్రదేశాల చట్టం ఉన్నా దానిని పక్కనబెట్టి అయోధ్య రామమందిరం సమస్యను తెచ్చారు. దానికి కాలం చెల్లించి కాబట్టి ఇప్పుడు 'జ్ఞానవాపి మసీదు' సమస్యను ముందుకుతెచ్చి అక్కడ నుండి మసీదు తొలగించాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. తాజ్‌మహల్ క్రింద శివాలయం ఉందని ప్రచారం చేస్తున్నారు. హిందు, ముస్లింల మధ్య విషపూరితంగా వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారు. దేశానికి మతం ముసుగువేసే ప్రయత్నం చేస్తున్నారు. వీరుపాలనలోకి రాగానే ఆర్టికల్-25 ప్రకారం రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను అపహాస్యంచేసే పద్ధతిలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల కార్యకలాపాలు ఉన్నాయి. ఒక ముస్లిం మహిళ గర్భస్థ శిశువును త్రిశూలంతో పొడిచి ఆ మహిళలను హత్య చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఆవుమాంసం తిన్నాడని నెపంవేసి నిజానిజాలు విచారించకుండా ఒక ముస్లిం రైతును రాళ్లతో, కర్రలతో కొట్టిచంపారు. దళితులపై దాడులకు పాల్పడుతున్నారు. పార్లమెంటు సాక్షిగా మతఘర్షణలకు ఆజ్యం పోస్తున్నారు. ఇటీవల మణిపూర్, హర్యానాలలో జరిగిన ఘటనలు కేంద్రంలో పాలిస్తున్న పార్టీ మతోన్మాద ధోరణులను వ్యక్తం చేస్తున్నాయి. మత ప్రాతిపదికలేని మన రాజ్యాంగం నుండి సోషలిస్టు, సెక్యులర్ పదాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. నూతన పార్లమెంటు భవనంలో జరిగిన తొలిసమావేశంలో రాజ్యాంగ ప్రతులలో ఈ పదాలను తొలగించి పంపిణీ చేయటం మన దేశం లౌకిక, సోషలిస్టు భావనకు విరుద్ధం. శంకరాచార్య అద్వయితమతం మత విద్వేషాలను రెచ్చగొట్టింది. బౌద్ధమతాన్ని, జైనమతాన్ని విచ్ఛిన్నంచేసే కార్యక్రమం చేసింది. ఆ నాటికి ఉన్న బౌద్ధ, జైన ఆరామాలను కూల్చివేయటమో, హిందూ దేవాలయాలుగా మార్చివేయటమో జరిగింది. ముస్లింరాజులే ఒక మేరకు మతసామరస్యానికి పూనుకున్నారు. అక్బర్ చక్రవర్తి 'దిన్-ఇ-ఇలాహీ' అనేకొత్త మతాన్ని నెలకొల్పి మతసామరస్యానికి పునాదులు వేశాడు.

భారతదేశ రాజ్యాంగం వేరు. మతం వేరు. సర్వమానవ సౌభ్రాతృత్వమే పునాది. స్వేచ్ఛగా జీవిస్తూ తమ మత విశ్వాసాలను కాపాడుకునే హక్కు అన్ని మతాలకు ఉంది. అంతర్గత వైరుధ్యాలు, వైషమ్యాలు పెరిగితే దేశం నాశనమవుతుందని గ్రహించాలి. 'మేక వన్నె పులి' దేశాన్ని మింగివేయాలని చూస్తున్నది. ప్రజలు మేల్కొని అప్రమత్తం కావాలి. మతోన్మాదుల పీఠాలను తొలగించాలి.

సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు
ఫోన్ : 9490952093

'లా' కప్పులో తుపాను

చింతపట్ల సుదర్శన్

అరుగుమీద అసహనంగా అటూ, ఇటూ తిరుగుతున్నది డాగీ. అది అలా తోకని రెండు వైపులకీ విసిరికొడుతూ తిరుగుతుండటానికి కారణం ఒక దోమ. కంటికి లీలామాత్రంగా కనిపించే దోమే. ఒక చోట కుదురుగ్గా నిలబడలేక పోతున్నది డాగీ. కూర్చోవడం అసాధ్యమై పోయింది డాగీకి. విసిగి వేసారిపోయి ఎందుకే దోమా నా తోకచుట్టూ తిరిగి నన్ను హింస పెడ్తున్నావు అసరిచింది డాగీ. నిన్నేమన్నా అంటున్నానా. నీ తోకచుట్టూ తిరుగుతుంటే ఎంతో సరదాగా ఉంది. భలేగా కూడా ఉంది అంది దోమ. నీకు నా భాష అర్థమైందే అని ఆశ్చర్యపడ్డది డాగీ. మనుషుల్లోలా మనకు వేరువేరు భాషలు లేవు. మనుషులుకాని వాళ్లందరి భాషా ఒకటేననుకుంటాను అంది దోమ. నీ సరదా చట్టుబండలవనూ నాకిక్కడ చచ్చే చావులాగుంది. కూర్చోలేనూ నించోలేను మధ్యమధ్య తోక మీంచి లేచి వచ్చి నా చెవుల దగ్గర పాడే సంగీతం చిర్రెత్తిస్తున్నది. నా వెంట పడ్డావేం మనుషులెవరూ దొరకలేదా అంది కోప్పడుతూ డాగీ. కోపం మంచిదికాదు బాసూ. మనుషులను చూడగానే తోక ఊపుతావు విశ్వాసం ప్రదర్శిస్తావు ఎందుకు ఈ కుక్క బుద్ధి మార్చుకోలేవా. నన్నుచూడు నేనే కాదు మా జాతి మొత్తం మనుషుల్ని శత్రువులుగా భావించి చెడుగుడు ఆడుకుంటాం. మా కారణంగానే మలేరియా వ్యాధి సోకుతుందని వందా పాతిక ఏళ్లకిందట 'రోనాల్డ్ రాస్' అనేవాడు కనిపెట్టాట్ట. ఆదొక్కటేకాదు ఇప్పుడు డెంగ్యూ అనే వ్యాధిని తగిలిచ్చి మనుషుల ప్రాణాల మీదికి తెస్తున్నాం. వాళ్లు దయతలిచిపెట్టే తిండితింటూ తోకాడిస్తున్నారు మీరు. కానీ మేం మా స్వశక్తిని నమ్ముకుని ప్రాణాలకు తెగించి మనిషి నెత్తురు తాగుతాం.

రంగస్థలం

మమ్మల్ని నాశనం చెయ్యడానికి ఎన్నో ఎత్తులు వేస్తున్నాడు జిత్తులమారి మనిషి. కానీ మేం 'సర్వవ్యాపకులం' దేశమేదైతేనేం, ప్రాంతం ఏదైతేనేం, మనుషులెవరైతేనేం మా 'స్టేబుల్ ఫుడ్డు' మనిషి బ్లడ్డే అంది దోమ. అప్పుడే అరుగు ఎక్కుతూ ఆ మాటలు విన్నది డాంకీ. ఎవర్రా మాట్లాడేది.. కనపడ్డంలేదు కాని వినపడ్తున్నది అంది. వచ్చావా బ్రో రారా! ఈ దోమ ఒకటి నాతోక వెంటపడ్డది అంది డాగీ. అదా సంగతి అందుకా ఆ తోక ఊపుడు అని ఇకిలిస్తూ గోడకి జారిగిల పడ్డది గాడిద. నా తోకచుట్టూ తిరగడం మానేసి మా డాంకీ తోకను సమలరాదూ అంది డాగీ. నీ తోకలా కుచ్చు లేదు నా తోకకి కర్రలా ఉంది వాలిందంటే గోడకేసి బాదనూ అంది డాంకీ. 'బ్రో దీని బాధ వదిలించు బ్రో' అంది డాగీ దీనంగా. దోమా ఏ సీమ దానివే! ఎక్కడ్నించి వచ్చావే? అసలు నీ ప్రాబ్లమ్ ఏమిటే? కొంపదీసి రాజమంద్రి జైలు బ్యాచ్ దానివైతే కావు కదా! అంది డాంకీ. జైలు బ్యాచి ఏంటి బ్రో అనడిగింది డాగీ. తెలీదూ నిన్న ఓ నాయకుడు సెలవిచ్చాడు కదా. ఓ మహా నాయకుడ్ని అన్యాయంగా జైలుపాలు చేశారని అంతటితో అక్కసుతీరాక జైల్లో ఉన్న ఆ మహామేధావిని ఆ కంప్యూటర్ పితామహుడ్ని కాటేసి చంపడానికి ఓ దోమల మందను జైల్లోకి పంపారని. జైలుకు రవాణా చేస్తున్న ఆ దోమల్లోంచి తప్పించుకు వచ్చిందేమో ఈ దోమ అని 'డవుటు' అంది డాంకీ. ఎవడుపడితేవాడు ఏది పడితే అది మాట్లాడ్తాడు. అయినా ఎవరో ఎవరినో కుట్టి చంపమంటే చంపటానికి మేం ఎవరి నౌకర్లమో, చాకర్లమో కాము. అది బుర్ర ఉన్నోడైనా, లేనోడైనా నాయకుడైనా, ఓటరుడైనా 'వీ డోంట్ కేర్' అది బెడ్రూమైనా 'జైల్‌సెల్' అయినా మాకు ఒకటే. మా మీద నిందవేసి నాయకుడికి బోలుడు సానుభూతి సంపాదించాలనుకుంటున్నారేమో అంది దోమ.

సానుభూతి అనేది 'పెయిడ్ ఈవెంట్' అయిపోయింది అంటూ అరుగుఎక్కాడు అబ్బాయి. కుక్కతోకను వదిలి మనిషి బ్లడ్ టేస్టు బాగా మరిగిన దోమ అబ్బాయి ముఖం మీద వాలి ఖర్మకాలి అతని రెండు అరచేతుల మధ్య శాశ్వత నిద్రలోకి జారిపోయింది. నువ్వన్నమాటకు అర్థం ఏమిటో చెప్పరాదూ అంది డాంకీ. ఏముంది వెరీ సింపుల్. స్వాతంత్ర్య సమరంలో జైలుకువెళ్లిన వాళ్లకు ఇంత పబ్లిసిటీ ఎక్కడేడిసింది! ఇంత ఫాలోయింగ్ ఉండేడిసిందా? ఇప్పుడు చూడుడి ఒకానొక లీడర్‌గార్ని జైల్లో పెడితే వంద దేశాల్లో జనం ఏడ్చి మొత్తుకుంటున్నారంట అన్నాడబ్బాయి. గుండెలు పగిలేవాళ్లూ, గుండెలాగిపోయిన వాళ్లూ అంటూ కట్టు కథలు కల్పించకు బ్రో అంది డాగీ. కట్టు కథలకాలం ఇది. మరి సోషల్ మీడియానే ఓ కట్టుకథల పుట్ట అదలాఉంచు. అక్కడెక్కడో జైలు ఊచలు లెక్కపెడ్తున్న నాయకుడికోసం ఇక్కడ మన సిటీలో కంప్యూటర్ ఇంజినీర్లు ఊరేగింపులు, నిరసనలు సాగించలేదా అన్నాడబ్బాయి. ఆ మర్నాడు ఈయన చేత ఊచలు లెక్కపెట్టించాలని సరదాపడ్డ నాయకుడికోసం కూడా ఇంజనీర్లు రోడ్ల మీదికి వచ్చారు కాదా అంది డాంకీ. అందుకే మరి సానుభూతి ఓ 'పెయిడ్ ఈవెంటో' 'ఫ్రీ ప్లాన్డు ఈవెంటో' అంటున్నానన్నాడబ్బాయి. 'స్కిల్లు' తెల్సిన వాడెగాన్ని 'స్కాము' లెరుగని వాడు అని సర్టిఫికెట్టు ఇచ్చేవారెందరో అంది డాంకీ. ఎవరికి వారు క్లీన్‌చిట్ ఇచ్చేస్తే ఎలా మరి కోర్టులూ, జడ్జిలూ ఉన్నావెందుకట అంది డాగీ. నేరం చేసినవాడు నేరం చేశానని ఒప్పుకోడు. నేరం రుజువు కాకపోతే ఎవరినీ కోర్టు శిక్షించలేదు. ఎంతపెద్ద కార్చిచ్చయినా ఈ రోజుల్లో చప్పున చల్లారనూ వచ్చు అన్నాడు అబ్బాయి అరుగు దిగిపోతూ.

సామాన్యుడి కోసం రైళ్ళు వెయ్యాలి

ఈ-మెయిల్

ఈ మధ్య ప్రధాని మోదీ కొత్తకొత్త రైళ్లను ప్రారంభిస్తున్నాడు .

సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు, అందుకోసం అనుకుంటే పొరపాటే !

అన్నీకూడా ఏసీ రైళ్ళే.

సామాన్యుడు వాటి దరిదాపులకు కూడా పోడు.

మరి ఎవరికోసం ఈ వందే భారత్ రైళ్ళు ?

ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు మాత్రమే ఎక్కుతుంటారు.

వ్యాపారస్తులు తప్ప అందరు ఖర్చుపెట్టేది ప్రజాధనమే !

వ్యాపారస్తులకి డబ్బు లెక్కవుండదు.

మరి ఈ వందే బారత్ రైళ్ళు ఎవరికోసం వేస్తున్నట్లు ?

కరోనా వచ్చిందని పాసెంజర్ రైళ్లను అన్నింటిని రద్దుచేశాడు మోదీ.

పోనీ తరువాత వాటిని పునరుద్ధరించాడా ! లేదు .

ఆ పాసెంజర్ రైళ్ల స్థానంలో స్పెషల్ రైళ్ళు అంటు కొత్తకొత్తపేర్లు తో రైళ్లువేసాడు.

కరోనా వచ్చింది, దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, సీనియర్ సిటిజెన్స్‌కి రైళ్లలో ఇచ్చే 33శాతం రాయితీ తొలగించాడు.

మరి ఎంపీలకి, ఎమ్మెల్యేలకి రాయితీలు ఎందుకు తొలగించలేదు ?

తొలగిస్తే అందరికి తీసివెయ్యాలికదా !

సామాన్యుడి మీద ఈ ప్రభుత్వానికి ఏమాత్రం జాలి దయలేదన్నది స్పష్టమౌతుంది.

పోనీ ఈ కొత్త రైళ్ళు అన్నీకూడా ఏసీ రైళ్ళు.

సామన్యుడు వీటి ముఖంకూడా చూడలేడు.

కనుక ఇప్పటికైనా సీనియర్ సిటిజెన్స్ కి రైళ్లలో ఇచ్చే 33 శాతం రాయితీ పునరుద్ధరించాలి.

పాసెంజర్ రైళ్ళను కొనసాగించాలి.

ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలోను సగం జెనరల్ బోగీలు తగిలించాలి.

అపుడు మాత్రమే సామన్యుడుకి రైళ్లవలన ప్రయోజనం ఉంటుంది.

నార్నె వెంకటసుబ్బయ్య

"సీమ" కు మరో ఎన్నికల తాయిలం?



వి. శంకరయ్య

ఒకతనికి ఇద్దరు భార్యలు. ఒకరు పడుచు భార్య. మరొకరు వయసు మళ్లినావిడ. నా మొగుడు పడుచువాడని చెప్పుకొనేందుకు అతనికున్న తెల్ల వెంట్రుకలన్నీ పడుచు పెళ్లాం పీకేసింది. నేనేమీ తక్కువ తినలేదు అన్నట్లు వయస్సు మళ్లినావిడ నా మొగుడు ముసలాడని చెప్పేందుకు నల్ల వెంట్రుకలన్నీ పీకేసింది. తుదకు అతనికి గుండు మిగిలింది. ఇంత కథనం ఎందుకంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పోటీపడి శ్రీ శైలం జలాశయం నీటిఅంశంలో వ్యవహరిస్తున్న వైఖరితో రాయలసీమ తుదకు ఎడారిగా మారే ప్రమాదముంది. రాష్ట్ర విభజనచట్టం మేరకు 2016 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ తీర్మానాన్ని దుమ్ములో కలిపి చట్టవిరుద్ధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణ ముందుకు తీసుకు పోతుంటే దాన్ని న్యాయ పరంగానూ చట్టబద్ధతగల అపెక్స్ కౌన్సిల్ వేదికపై నిలువరించ వలసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్ల కాలం గడిపేసింది. నీటి కేటాయింపులు తప్ప మిగిలిన అనుమతులు కేంద్రంతో నిత్యం పేచీపడుతూనే తెలంగాణ సంపాదించింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్రంతో పూసుకు తిరుగుతున్నా రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఒక్క అనుమతి సంపాదించలేదు. ఇప్పుడు దింపుడు కళ్లం ఆశగా తుదకు తాగునీటి పథకంపేర రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పాక్షికంగా నిర్మించేందుకు తల పడటం ఏమనాలి? తెలంగాణను నిలువరించేందుకు ఇది పరిష్కార మార్గమా? ఎన్నికల తాయిలంతప్ప వేరుకాదు. రెండేళ్ల క్రితమే ఈ పని చేసివుంటే ఎవ్వరూ అనుమానించే వారుకాదు.

కేంద్ర ప్రభుత్వం నదీ యాజమాన్య బోర్డును నోటిఫైచేసి రెండేళ్లవుతున్నా ప్రాజెక్టులను బోర్డుకు తెలంగాణ అప్పగించలేదు. పైగా సాగర్‌కు నీటి అవసరం లేకున్నా మరో పక్క శ్రీ శైలంలో కనీస నీటిమట్టంస్థాయి పడిపోతున్నా తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తోంది. తనేమీ తక్కువ కాదన్నట్లు ఆంధ్రప్రదేశ్ కూడా పోటీపడి విద్యుదుత్పత్తిచేసి ఇద్దరూ కలసి గత ఏడాది రెండువేల టియంసిలు శ్రీశైలం చేరితే జూన్ వచ్చేసరికి జలాశయం ఖాళీచేశారు. రాయలసీమకు సాగునీరు కాదు కదా తాగునీటికి చుక్క మిగల్చలేదు. ఇదేం అన్యాయమని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా నిలదీసే పరిస్థితి లేకపోవడమే సీమ ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన తాగునీటి పంపింగ్‌కు కూడా జూన్‌నాటికి నీళు



మిగలవు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఈలోపు నీటి కేటాయింపులు లభిస్తే బోర్డు వారికే ప్రాధాన్యత ఇస్తుంది. మిగిలితేనే మనకు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పోటీగా పర్యావరణ అనుమతులు వచ్చినా ప్రస్తుతం లేవని గ్రీన్ ట్రిబ్యునల్ స్టే తో వున్న రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తాగునీటి కోసమని పాక్షికంగా పనులు మొదలు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో తాజాగా జారీచేసింది. ఎన్నికల ముంచుకొస్తున్నందున తన కోటగా భావించే రాయలసీమలో ఏర్పడిన అసంతృప్తి జ్వాలలు పసిగట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా ఏదో ఒక ప్రక్రియ చేపట్టడం తప్పుపట్టలేము గాని అంతర్ రాష్ట్ర జలవివాదాల్లో తెలంగాణను నిలువరించేందుకు ఇది ఏమాత్రం సరిపోదు. గుక్కెడు నీటికోసం తపిస్తున్న రాయలసీమ ప్రాంతానికి ఏదైనా మేలు జరగాలంటే తెలంగాణతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో సామరస్యంగా ముందుకు పోవాలి. లేదా చట్టపరంగా తెలంగాణకు దీటుగా ఎదుర్కోవాలి. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సామరస్యానికి ఎప్పుడూ సిద్ధంగాలేరు. సామరస్యానికి తలపడితే ఆయన అనుసరిస్తున్న విధానాల పునాదులు బీటలు వారతాయి. ఆంధ్ర ప్రదేశ్‌తో ఎప్పుడూ తగాదా వుండాలి. ఆంధ్రోళ్లు నీళ్లు దోచుకు పోతున్నారనే భావోద్వేగాలతో అధికారం నిలబెట్టుకోవాలి. ఇది జగమెరిగిన సత్యం. పోనీ ఈ విషయం అర్థం చేసుకొని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చట్టపరంగా తెలంగాణను ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నారంటే అదీ లేదు. తెలంగాణ ప్రభుత్వంతో తలపడేందుకు కెసిఆర్‌తో పెనవేసుకున్నబంధం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాళ్లకు సంకెళ్లు వేస్తోంది. వాస్తవం చెప్పాలంటే ఈ దశలో ఎన్నికలు ముంగిట పెట్టుకొని అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగితే ముఖ్యమంత్రి కెసిఆర్ తో ఢీ అంటే ఢీ అనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ ఒడ్డి సిద్ధంగాలేరు. ఫలితంగా రాయలసీమ బలి పశువు కానున్నది. అందుకోసం అపెక్స్‌కౌన్సిల్ సమావేశం డిమాండ్‌చేసే ఆలోచన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేయడంలేదు. దురదృష్టం మేమంటే రాయలసీమ కూడా ఈ దిశగా ఆలోచన చేయడంలేదు. ప్రధానంగా సీమ అస్తిత్వంకోసం నిజాయితీగా పోరాడే ఉద్యమకారులు కూడా కీలక మైన ఈ డిమాండ్ ముందుకు తేవడంలేదు.

2016 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై తీవ్ర చర్చలు జరిగాయి. తుదకు నదీ యాజమాన్య బోర్డు కేంద్ర జలసంఘం నిశితంగా పరిశీలన గావించిన తర్వాత అపెక్స్ కౌన్సిల్ ఆమోదించేవరకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు, దిండి ఎత్తిపోతల పథకాల నిర్మాణం నిలుపుదల చేయాలని తీర్మానం చేశారు. ఇది ప్రభుత్వ రికార్డుల్లో నమోదైవుంది. గత ప్రభుత్వం చేపట్టి అమలుచేసిన ఏ అంశం కూడా పొడగిట్టని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్కారు ఈ తీర్మానాన్ని పక్కన పెట్టింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అన్ని అనుమతులువచ్చి నీటి కేటాయింపులు మాత్రం మిగిలివున్న దశలో జగన్మోహన్ రెడ్డి సర్కారు నిర్లక్ష్యం వహించితే నీటికేటాయింపులు కూడా తెలంగాణ సాధించితే శ్రీ శైలం జలాశయం నుండి 90 టియంసిలు నికర జలాలు దానికి దఖలు పడతాయి. ఇదే జరిగితే రాయలసీమతో పాటు ఆంధ్రప్రదేశ్ సాగునీటిపై తీవ్ర ప్రతికూల ప్రభావంపడే అవకాశముంది.

వి. శంకరయ్య, సెల్:9848394013

ప్రజల కష్టం అర్థం చేసుకున్నప్పుడే నిజమైన ప్రజాసేవకులు కాగలరు

182 మంది ఐఏఎస్ అధికారులతో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: పేదల కష్టాన్ని అర్థంచేసుకోగల మనస్సు ఉన్న వారే నిజమైన ప్రజాసేవకుడు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బడుగు, బలహీన వర్గాల సాధికారతకు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని 182 మంది ఐఏఎస్‌ల బృందాన్ని ఉద్దేశించి అన్నారు. ఫైల్ నుంచి ఫీల్డ్‌కు... ఫీల్డ్ నుంచి ఫైల్‌కు మధ్య బంధాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రజా కేంద్రీకృత దృక్పథంతో, సామాజిక చైతన్యంతో ముందుకెళ్లాలని, తీసుకునే నిర్ణయాలతో ప్రజలపై ప్రభావాన్ని గమనంలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్రంలోని వివిధ శాఖలు, విభాగాల్లో సహాయక కార్యదర్శులుగా నియమితులైన 2021 బ్యాచ్‌కు చెందిన 182 మంది ఐఏఎస్ అధికారులకు రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ముర్ము ఆతిథ్యమిచ్చారు.వారితో మాట్లాడిన ఆమె 'సమాజంలోని వెనుకబడిన వర్గాల కష్టాలను దగ్గర నుంచి చూశా. అణగారిన వర్గీయులకు సాయం చేసేందుకు తమ స్థాయికి మించి ప్రయత్నించిన అధికారులనూ చూశా. పేదల కష్టాన్ని అర్థం చేసుకునే మనస్సు ఉంటేనే నిజమైన ప్రజా సేవకుడు లేకపోతే బ్యూరోకాట్‌గా మిగిలిపోతారని రాష్ట్రపతి నొక్కిచెప్పారు. సమ్మిళిత, ప్రగతిశీల, చైతన్యవంత సమాజం ద్వారా మహిళలు జీవితంలో రాణించగలుగుతారని అన్నారు. మహిళా సాధికారత, మహిళా నేతృత్వ అభివృద్ధి పథంలో దేశం పయనిస్తోందని, పార్లమెంటులో మహిళా బిల్లుకు ఆమోదం సంతోషంగా ఉందన్నారు. నాలుగేళ్లలో మహిళా ఐఏఎస్‌లు పెరగడంపై హర్షం వ్యక్తంచేశారు. 2019 నుంచి 2022 బ్యాచ్‌లలో 28-34శాతం మేర మహిళా ఐఏఎస్‌లు ఉన్నారని తెలిసింది. 2023 బ్యాచ్‌లో మహిళల ప్రాతినిధ్యం 42శాతానికి పెరగడం ఆనందాన్ని ఇచ్చింది. 'టాప్ 25 ర్యాంకుల్లో 14 స్థానాల్లో మహిళలు ఉన్నారు. సానుకూల మార్పునకు అనుకూల పవనాలు వీస్తున్నాయి. పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ సమాజాన్ని మెరుగుపరుస్తూ గొప్ప దేశాన్ని నిర్మించే దిశగా ముందుకెళ్లండి' అని ఐఏఎస్‌లకు ముర్ము సూచించారు. సుపరిపాలనలో దేశాన్ని, ప్రజలకు ముందుకు నడిపించే మిషన్‌కు సారథులు కావాలన్నారు. దేశానికి, దేశ ప్రజలకు సేవ చేయడం విధి ధర్మమని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అమృత కాలానికి అనుగుణంగా పదవీ కాలం ఉండటంతో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు తమ వంతు తోడ్పాటు అందించాలని ఐఏఎస్‌లతో ముర్ము అన్నారు. మీ ఆలోచనలు, నిబద్ధత, సృజనాత్మకత, తోడ్పాటుతో గొప్ప మార్పు తేగలరంటూ వారిలో స్ఫూర్తినింపారు.

భారత క్రీడాకారులకు మమత అభినందన

కోల్‌కతా: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన భారతీయ క్రీడాకారులను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం అభినందించారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. భవిష్యత్తులో దేశానికి కీర్తిప్రతిష్ఠలు చేకూర్చేలా వారి ప్రయత్నాలు ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. "హాంగ్‌జౌ (చైనా)లో జరుగుతున్న 19వ ఆసియా క్రీడల 2వ రోజు భారత్ విజయ పరంపర ఇప్పుడు 10 పతకాలతో కొనసాగుతోంది! ఈరోజు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి తొలి బంగారు పతకాన్ని సాధించినందుకు రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, దివ్యాంష్ సింగ్ పన్వార్‌లకు హృదయపూర్వక అభినందనలు" అని మమత పేర్కొన్నారు. పురుషుల '10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం గెలిచినందుకు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్‌కు మళ్లీ ప్రశంసలు. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో దేశానికి మరో కాంస్యం సాధించినందుకు ఆదర్శ్ సింగ్, అనీష్ భన్వాలా మరియు విజయవీర్ సిద్ధూలకు శుభాకాంక్షలు. రోయింగ్‌లో మరో రెండు కాంస్య పతకాలను సాధించినందుకు పురుషుల క్వాడ్రపుల్ స్కల్స్ జట్లకు అభినందనలు' అని ఆమె తెలిపారు.

మహిళను వివస్త్రను చేసి...నోట్లో మూత్రం పోయించి...

బీహారులో అమానుషం

పాట్నా: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వలేదని దళిత మహిళపై ఓ దుర్మార్గుడు అత్యంత అమానవీయంగా ప్రవర్తించాడు. ఆమెను వివస్త్రను చేసి దాడి చేశాడు. ఆమె నోట్లో మూత్రం పోయించాడు. ఈ అమానుష ఘటన బీహార్ రాజధాని పాట్నాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...పాట్నా జిల్లా మోసిమ్‌పూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త...స్థానికంగా పలుకుబడి గల ప్రమోద్ సింగ్ వద్ద కొన్ని నెలల క్రితం రూ.1500 అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును వడ్డీతో సహా తిరిగి చెల్లించినా అదనపు వడ్డీ ఇవ్వాల్సిందేనని ప్రమోద్ సింగ్ డిమాండ్ చేశాడు. అందుకు ఆ దళిత దంపతులు అంగీకరించలేదు. దీంతో ఆ దంపతులపై కోపం పెంచుకున్న ప్రమోద్... గతవారం ఆ మహిళకు ఫోన్ చేసి బెదిరించాడు. అదనపు వడ్డీ ఇవ్వకపోతే గ్రామంలో నగ్నంగా ఊరేగిస్తానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రమోద్ శనివారం రాత్రి అతడి అనుచరులతో కలిసి మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమెను బలవంతంగా తన ఇంటికి తీసుకెళ్లి దాడి చేశాడు. మహిళను వివస్త్రను చేసి కర్రలతో కొట్టించాడు. అంతటితో ఆగకుండా తన కుమారుడితో మహిళ నోట్లో మూత్రం పోయించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధిత మహిళ మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితులు ప్రమోద్ సింగ్, అతడి కుమారుడు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళ ప్రస్తుతం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు వెల్లడించారు.

ఎన్‌డీఏలో చేరే ప్రసక్తేలేదు

• నితీశ్‌కుమార్ స్పష్టీకరణ • వస్తానన్నా రానివ్వం: బీజేపీ

పాట్నా: తిరిగి ఎన్‌డీఏ గూటికి వెళ్లే ప్రసక్తేలేదని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ సోమవారం తేల్చిచెప్పారు. తాను తిరిగి ఎన్‌డీఏలో చేరతానంటూ వచ్చిన వార్తలను నితీశ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఏడాది క్రితం నితీశ్ ఎన్‌డీఏను వీడి ఆర్‌జేడీతో కూడిన మహాకూటమిలో చేరిన విషయం విదితమే. కాగా, నితీశ్ తిరిగి వస్తానని వేడుకున్నా స్వాగతించే అవకాశం లేదని బీజేపీ చెప్పుకున్నది. నితీశ్‌కుమార్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్ష ఇండియా కూటమిని పటిష్టవంతం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని స్పష్టంచేశారు. ఎన్‌డీఏ గూటికి చేరతారన్న ఊహాగానాలపై విలేకరులు ప్రశ్నించగా అదంతా ఒట్టిదేనని తేల్చిచెప్పారు. ప్రధానమంత్రికి కావాల్సిన అన్ని అర్హతలు నితీశ్‌కు ఉన్నాయంటూ ఆయన పార్టీ సహచరులు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... మాటలు వద్దని స్పష్టంగా చెప్పినట్లు నితీశ్ వెల్లడించారు. 'అలాంటి ప్రకటనలు చేయవద్దని పార్టీ సహచరులకు స్పష్టంగా చెప్పాను. ఇండియా కూటమిని బలోపేతం చేయడమే నా కర్తవ్యం. ఆ దిశగానే నేను పనిచేస్తాను' అని నితీశ్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ నేత దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ ఎన్‌డీఏలో తిరిగి చేరే అవకాశమే లేదన్నారు. నితీశ్ వెంట బీహారు ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా ఉన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంలో రాజీలేదని తేజస్వి చెప్పారు. ఇండియా కూటమి కన్వీనర్‌గా తన పేరు ప్రస్తావించకపోవడంతో నితీశ్‌కుమార్ అసంతృప్తిగా ఉన్నట్లు ఓ వర్గం మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన జీ 20 సదస్సులో ప్రధాని మోదీతో కలిసి నితీశ్ హాజరు కావడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. ఎన్‌డీఏలో తిరిగి చేరే ప్రసక్తేలేదని నితీశ్ చెప్పిన సమయంలో పక్కన తేజస్వి కూడా ఉన్నారు. ఇండియా కూటమి భవిష్యత్ కార్యకలాపాలు, ప్రధాని అభ్యర్థిగా మిమ్మలను జేడీయూ నేతలు ప్రతిపాదించిన విషయాన్ని ప్రశ్నించగా కూటమి పటిష్టత కోసం పనిచేస్తానని చెప్పారు. ప్రధాని అభ్యర్థి విషయం ప్రస్తావించవద్దని తన సహచరులకు చెప్పానన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతికి గతంలో హాజరైన బీజేపీ నాయకులు...ఇప్పుడు ఎంతమంది వచ్చారో తెలియదని చెప్పారు. కాగా, నితీశ్, ఆయన మంత్రివర్గ సహచరులు, అధికారులు అక్కడ నుంచి వెళ్లిన తర్వాత బీజేపీ నాయకులు చేరుకున్నారు.

మహిళా బిల్లు అమలుపై కేంద్రానికి నిరాసక్తత

ఎన్నికల కోసమేనని కాంగ్రెస్ విమర్శ

పనాజీ: మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నరేంద్రమోదీ ప్రభుత్వం సుముఖంగా లేదని కాంగ్రెస్ పార్టీ సోమవారం విమర్శించింది. ఈ బిల్లును కేవలం షోకేస్‌లో పెట్టాలని మోదీ సర్కారు కోరుకుంటున్నదని నిందించింది. బిల్లు తీసుకురావడాన్ని ఎన్నికల గిమ్మిక్కుగా అభివర్ణించింది. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌కు సంబంధించి ఏఐసీసీ జాతీయ సమన్వయకర్త భవ్య నరసింహమూర్తి ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జాప్యం లేకుండా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు గతవారం పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లుకు నారీశక్తి వందన్ అధినియంగా నామకరణం చేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత బిల్లును అమలు చేస్తామని, జనగణన ప్రక్రియను వచ్చే ఏడాది ప్రారంభిస్తామని కేంద్రం చెబుతోంది. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ బిల్లును 1989లో నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ పార్లమెంటు ముందుకు తీసుకొచ్చినట్లు నరసింహమూర్తి గుర్తుచేశారు. అయితే, నాటి బిల్లుకు బీజేపీ అగ్రనేతలు ఎల్‌కే అద్వానీ, అతల్ బిహారీ వాజ్‌పేయి, యశ్వంత్ సిన్హా, రామ్ జెత్మలానీ వ్యతిరేకంగా ఓటు వేశారని, బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించినా... రాజ్యసభలో ఏడు ఓట్ల తేడాతో వీగిపోయిందని వెల్లడించారు. 1992 డిసెంబరులో నాటి ప్రధాని పీవీ నరసింహారావు 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలులోకి తీసుకొచ్చారని ఆమె తెలిపారు. చాలా రాష్ట్రాల్లో ఎస్‌సీ, ఎస్‌టీ, ఓబీసీలకు సంబంధించిన కోటాలో మహిళలకు సీట్లు రిజర్వు చేశాయని, రాజీవ్‌గాంధీ దార్శనికత కారణంగా నేడు 15 లక్షల మంది మహిళలకు రాజకీయ సాధికారత లభిచిందన్నారు. భారతదేశంలో దాదాపు 40శాతం మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా ఉంటున్నారని చెప్పారు. 2010లో మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ప్రతిపాదించి...ఆమోదింపచేసిందని ఆమె గుర్తు చేశారు. ఏకాభిప్రాయం కొరవడటంతో లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందలేదన్నారు. రాజ్యసభలో ప్రతిపాదించిన లేదా ఆమోదించిన బిల్లు మురిగిపోలేదని, అందువల్ల మహిళా బిల్లు సజీవంగానే ఉందని నరసింహమూర్తి వివరించారు. బీజేపీకి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ తొమ్మిదిన్నరేళ్లుగా మోదీ ప్రభుత్వం బిల్లును ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. దీనికితోడు బిల్లు అమలుకు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అంటూ షరతులు పెడుతోందని, బిల్లు అమలు జాప్యానికి బీజేపీ పన్నిన కుట్ర అని ఆమె ఆరోపించారు.

కశ్మీర్ వాసులకు ఉపశమనం

శ్రీనగర్: కశ్మీర్‌లోని ఎత్తైన ప్రాంతాలలో మంచు కురుస్తోంది. మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ నెలలో రికార్డు స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలను అనుభవించిన అక్కడి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. శ్రీనగర్ నగరంలో సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 18.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తర కశ్మీర్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అమర్‌నాథ్ గుహ, గుల్మార్గ్ పరిసర ప్రాంతాలు సహా దక్షిణ కశ్మీర్‌లోని ఎత్తైన ప్రాంతాలలో హిమపాతం నమోదైందని అధికారులు తెలిపారు. సెప్టెంబరు రెండో వారంలో వీచిన వేడిగాలులకు భారీ వర్షంతో తెరపడింది. గత రాత్రి శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 10.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంతకు ముందు రాత్రి 13 డిగ్రీల సెల్సియస్ నుంచి తగ్గింది. ఆగస్టు, సెప్టెంబరులో లోయలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తక్కువ వర్షపాతం నమోదైంది. ఫలితంగా నీటి వనరులలో నీటి మట్టాలు తగ్గాయి. దీని కారణంగా ప్రజలు నీటి కొరతను ఎదుర్కొన్నారని వాతావరణ శాఖ డైరెక్టర్ డైరెక్టర్ సోనమ్ లోటస్ తెలిపారు. జమ్మూకశ్మీర్, లడఖ్ అంతటా వాతావరణం మేఘావృతమై ఉంటుందని, లోయలోని కొన్ని చోట్ల రెండ్రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చట్టం తేవాలి

తమిళనాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు సూచన

చెన్నై: ప్రభుత్వ భూముల ఆక్రమణపై మద్రాస్ హైకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. దీనికి వ్యతిరేకంగా చట్టం చేయవలసిన అవసరం ఉందని పేర్కొంది. ప్రభుత్వ భూములను లాక్కునే విషయంలో నిర్మాణాత్మక అవినీతిని పరిశీలించాలని, అటువంటి చట్టవిరుద్ధ చర్యలను నిరోధించడానికి తగిన చట్టాన్ని రూపొందించాలని కోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇక్కడ కోయంబేడు వద్ద సెంట్రల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న 3.45 ఎకరాల భూమిలో షాపింగ్ మాల్ నిర్మాణం కోసం పట్టా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించాలని కోరుతూ హోటల్ శరవణ భవన్ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించిన జస్టిస్ ఎస్‌ఎం సుబ్రమణ్యం ఈ ఆదేశాలు ఇచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ఏఐఏడీఎంకే ప్రభుత్వం ఈ భూమిని కేటాయించగా... ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం గత ఏడాది రద్దు చేసిందని అది వాదించింది. పిటిషనర్‌కు పట్టా మంజూరుకు అర్హత లేదన్న నిర్ణయానికి రావడానికి కేసుకు సంబంధించి సంబంధిత పార్టీలు సమర్పించిన పత్రాలు సరిపోతాయని న్యాయమూర్తి చెప్పారు. భూసేకరణపై జరిమానా విధించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. భూకబ్జాలకు సంబంధించిన కేసులు గుట్టలుగా పేరుకుపోవడం, ప్రభుత్వ పెద్దల కుమ్మక్కుతో పద్ధతిగా సాగుతున్న తీరు తీవ్ర సమస్యగా మారిందన్నారు. భూకబ్జా కేసుల్లో రాజకీయ జోక్యం, ప్రభుత్వ అధికార యంత్రాంగం సహకరిస్తోందని న్యాయమూర్తి చెప్పడం కొసమెరుపు. ప్రస్తుత కేసుకు సంబంధించి, ప్రభుత్వ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుని, ఆస్తికి కంచె వేయాలని, రాజ్యాంగ న్యాయస్థానాలు నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా భారీ ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోర్టు అధికారులను ఆదేశించింది. తమిళనాడు అంతటా అధిక విలువైన ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణకు బాధ్యులైన , జవాబుదారీగా ఉన్న ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో సహా వారిపై తగిన క్రిమినల్ ప్రాసిక్యూషన్, క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని న్యాయమూర్తి అధికారులను ఆదేశించారు.

రూ.125 కోట్ల విలువైన యూనిటెక్ ఆస్తుల జప్తు: ఈడీ

న్యూఢిల్లీ: యూనిటెక్ గ్రూప్‌కు చెందిన గృహ కొనుగోలుదారుల ఫిర్యాదుల ఆధారంగా మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తుకు సంబంధించి యూనిటెక్ ఇన్ఫోపార్క్ లిమిటెడ్‌కు చెందిన రూ.125.06 కోట్ల విలువైన భూమిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాత్కాలికంగా జప్తు చేసినట్లు ఈడీ అధికారులు సోమవారం తెలిపారు. చెన్నైలోని నల్లంబాక్కంలో యూనివరల్డ్ సిటీ టౌన్‌షిప్‌లో భాగమైన 4.79 ఎకరాల భూమిలో 39.83 శాతం వాటాను ఈడీ తాత్కాలికంగా అటాచ్ చేసింది. "అటాచ్ చేసిన భూమి విలువ రూ. 125.06 కోట్లు. ఈ భూమి యూనిటెక్ ఇన్ఫోపార్క్ లిమిటెడ్‌కు చెందినది. ఇందులో 39.83 శాతం వాటాలు నార్నిల్ ఇన్ఫోసొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (యునిటెక్ గ్రూప్ ప్రమోటర్లు చంద్రాస్‌కు చెందిన బినామీ కంపెనీ) కలిగి ఉన్నాయి.' అని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. యునిటెక్ గ్రూప్, దాని ప్రమోటర్లు, ఇతరులపై గృహ కొనుగోలుదారుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఢిల్లీ పోలీసులు, సీబీఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ చేపట్టిన దర్యాప్తులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది.

కీలక బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

కర్నూలు విభిన్న ప్రతిభావంతురాలు జఫరీన్‌కు ఉద్యోగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వస్తు, సేవల పన్ను, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ సవరణ బిల్లులను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సోమవారం ఆమోదించింది. ఈ బిల్లులను ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనసభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదముద్ర వేసింది. బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ కర్నూలుకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు జఫరీన్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణించే వారిని గుర్తించి ప్రోత్సహించడం, తద్వారా యువతలో స్ఫూర్తి నింపడమే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ సవరణ బిల్లు ముఖ్య ఉద్దేశమన్నారు. 'ఇండియన్ డెఫ్ టెన్నిస్ టీమ్‌కి కెప్టెన్'గా షేక్ జఫరీన్ అనే విభిన్న ప్రతిభావంతురాలి (వినికిడి లోపం) విజయపరంపర గురించి మంత్రి వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 20 అత్యున్నత పురస్కారాలను అందుకున్న జఫరీన్ కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారిణి కావడం గర్వకారణమన్నారు. దేశం గర్వించదగ్గ క్రీడాకారిణి అని ప్రశంసించారు. టెన్నిస్‌లో రాణిస్తున్న జఫరీన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించి, ప్రభుత్వ ఉద్యోగమిస్తున్నట్లు బుగ్గన ప్రకటించారు. వ్యవసాయ శాఖ కో-ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఆమెను నియమిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎలక్ట్రానిక్, కామర్స్ ఆపరేటర్లను (ఈసీవోలను) పన్ను పరిధిలోకి చేర్చే వస్తు, సేవల పన్ను సవరణ బిల్లు-2023కు సభ ఆమోదం తెలిపింది.

సీఎం అవినీతిపరుడైతే నీతిమంతులు జైళ్లకే!

- మాక్ అసెంబ్లీ నిర్వహించిన టీడీఎల్పీ
- 'ఆర్థిక ఉగ్రవాది-ధన పిశాచి' అంశంపై వాయిదా తీర్మానం
- పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించిన రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అరాచకవాది, పచ్చి అవినీతి పరుడని టీడీపీ శాసనసభ్యులు ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన ఎమ్మెల్యేలు... సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆర్థిక ఉగ్రవాది ధన పిశాచి' అంశంపై సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రి అవినీతి, దోపిడీని ఆధారాలతో సహా టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. గత నాలుగు సంవత్సరాల నాలుగు నెలల పాలనా కాలంలో మద్యం, ఇసుక, సంక్షేమం ముసుగులో దాదాపు రూ.3,30,500 కోట్ల ప్రజాసంపదను దిగమింగిన ధన పిశాచి జగన్ రెడ్డి అని రామానాయుడు తెలిపారు. దేని ద్వారా ఎంత రాబట్టారో వెల్లడించారు. 16 నెలల జైలు జీవితం... 38 క్రిమినల్ కేసులు.. 54 డిశ్చార్జ్ పిటిషన్లు...158 స్టేలు...లెక్కకు మిక్కిలి ఐపీసీ సెక్షన్లు...మొన్ననే పూర్తైన పదేళ్ల బెయిల్ కాలం... ఇదీ జగన్ రెడ్డి సచ్ఛీలత అని ఎద్దేవా చేశారు. ఆయన అవినీతి, దోపిడీని ప్రశ్నిస్తూ, ప్రభుత్వ దుర్మార్గాలను ఎదిరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారన్న అక్కసుతో.. కుట్రలు..కుతంత్రాలతోనే జగన్ రెడ్డి ఏ తప్పూ చేయని చంద్రబాబుని అన్యాయంగా కటకటాల పాలుచేశాడని ఆయన మండిపడ్డారు. ఈ వాస్తవాలన్నీ ప్రజలు గ్రహించాలని, జగన్‌కు వచ్చే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రానికి క్విడ్ ప్రోకో, షెల్ కంపెనీలు, మనీ ల్యాండరింగ్, ఇన్ సైడ్ ట్రేడింగ్ వంటి పదాలను... వాటి తీరుతెన్నుల్ని పరిచయం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డని, అప్పటివరకు మనకు ఆ పదాలేమిటో తెలియదన్నారు. అలాంటి వ్యక్తి ఈ రోజు అవినీతిపై సుభాషితాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 26 హౌస్ కమిటీలు వేసి ఏమీ తేల్చలేకపోయారు. తరువాత జగన్ రెడ్డి తల్లి విజయమ్మ చంద్రబాబునాయుడు అవినీతి చేశాడని న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి, ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో చివరకు తన పిటిషన్లు తానే వెనక్కు తీసుకున్నారు. అదీ చంద్రబాబునాయుడి నీతి...నిజాయితీ...నిబద్ధతలకు నిదర్శనాలని ఆయన పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో రాజశేఖర్ రెడ్డి, జగన్ బంజారా హిల్స్ రోడ్ నెం-2 లో తమకున్న 2075గజాల చిన్నఇల్లు అమ్ముకోవడానికి అనుమతివ్వాలని నాటి ప్రభుత్వాన్ని కోరారు. అప్పుడు అంత దీనస్థితిలో ఉన్న ఆ కుటుంబం 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయినప్పటినుంచీ నేటివరకు రూ3.30లక్షలకోట్ల ఆస్తులు సంపాదించింది. రూ.43 వేలకోట్ల ఆస్తుల్ని సీబీఐ చార్జిషీట్ల ద్వారా ఈడీ నిగ్గుతేల్చింది. ఇంకా విచారణలో తేల్చాల్సింది రూ.60,000కోట్లుగా ఉంది.

అలాగే తనపై 38 క్రిమినల్ కేసులున్నాయని స్వయంగా జగన్ రెడ్డే 2019లో వేసిన తన ఎన్నికల అఫిడవిట్లో చెప్పారు. ఆ కేసుల నిమిత్తం 54 డిశ్చార్జ్ పిటిషన్లు వేశారు. సదరు కేసుల్లో ఇప్పటివరకు న్యాయస్థానాల నుంచి ఆయన తెచ్చుకున్న స్టేలు 158. ఇక జగన్ రెడ్డిపై నమోదైన ఐపీసీ సెక్షన్ల జాబితా కొండవీటి చాంతాడునే మించిపోతుంది. తాము చెప్పిన అంశాలు పరిశీలించాక అయినా జగన్ రెడ్డి తాను చేసింది ఎంత పెద్ద తప్పో తెలుసుకొని చంద్రబాబుని తక్షణమే విడుదల చేయించి ఆయనకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీడీఎల్పీ డిమాండ్ చేస్తోంది. ఇలాంటి అవినీతిపరుడు ముఖ్య మంత్రులు అయితే నీతిమంతులు జైలు పాలవుతారనే ఫెడరల్ క్యాస్ట్రో సూక్తి నిజమని ప్రజలంతా గ్రహించాలని రామానాయుడు సూచించారు.

1 నుంచి పవన్ 'వారాహి' యాత్ర

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ 'వారాహి' యాత్ర నాలుగో విడత అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో యాత్ర ప్రారంభం కానుందని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖ్య నాయకులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ యాత్ర మచిలీపట్నం, పెడన, కైకలూరు నియోజకవర్గాల మీదుగా సాగుతుందని నాదెండ్ల వెల్లడించారు.

సత్యేందర్ జైన్ మధ్యంతర బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు సుప్రీం కోర్టు సోమవారం ఊరటనిచ్చింది. వైద్య కారణాలతో సత్యేంద్ర జైన్‌కు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను కోర్టు అక్టోబర్ 8 వరకు పొడిగించింది. జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం మరోసారి అక్టోబర్ 9న విచారించ నున్నది. ఇంతకు ముందు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 25 వరకు పొడిగించింది. సత్యేంద్ర జైన్‌కు జులై 21న శస్త్రచికిత్స జరిగింది. వైద్య పరమైన కారణాలతో మధ్యంతర బెయిల్‌ను కోర్టు పొడిగించింది. మనీలాండరింగ్ కేసులో సత్యేందర్ జైన్‌కు మే 26న సుప్రీంకోర్టు ఆరు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకునేందుకు అనుమతి ఇచ్చిన కోర్టు సాక్షులను ప్రభావితం చేయొద్దని హెచ్చరించింది. అనుమతి లేకుండా ఢిల్లీ దాటి బయటకు వెళ్లకూడదని, మీడియాతో మాట్లాడొద్దని స్పష్టం చేసింది. సత్యేందర్ జైన్ 202 మే 31 నుంచి మనీలాం డరింగ్ కేసులో కస్టడీలో ఉన్నారు. ఏప్రిల్ 6న ఢిల్లీ హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించగా ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మే 25న తీహార్ జైలులోని స్నానాల గదిలో జారిపడి పోయారు. ఆ తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో లోక్‌నాయక్ జైప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి తరలించారు.

భూ పంపిణీతోనే పేదలకు లబ్ధి

- కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలి
- భూపంపిణీ చట్టాలు అమలు జరగాలి
- 90 ఏళ్లుగా భూమి కోసం ఎర్రజెండా పోరు
- బాపట్ల బహిరంగ సభలో వక్తలు
- ఉత్సాహపూరితంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం

ఉపాధి పథకం సమగ్ర అమలుకు పోరాటం: రామమూర్తి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమగ్ర అమలు కోసం కార్మికులు పోరాటం సాగించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ ఉపాధ్యక్షుడు కె.రామమూర్తి పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తుచేశారు. పథకం ప్రారంభ సమయంలో 2.23 కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు లబ్ధి చేకూరిందని, నేడు దీనిని నరేంద్ర మోదీ 63 వేల మందికి కుదించి వేశారని మండిపడ్డారు. ఈ పథకం కింద ప్రతి కార్మికుడికి ఉపాధి దక్కేందుకు ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మివేస్తోందని విమర్శించారు. ఎల్ఐసీ మొదలు విమానాశ్రయాలు, ఓడరేవులను అదానీ వంటి కార్పొరేట్ మిత్రులకు అప్పగించిందన్నారు. మోదీ సర్కారు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తోందని, దీనిద్వారా మరోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నదని చెప్పారు. దేశాన్ని నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్ద దించడంలో కార్మికవర్గం క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున భూ పోరాటాలు నిర్వహించిందని, తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపిన చరిత్ర ఉందన్నారు. బాపట్లలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు కార్మిక ఉద్యమం బలపడేందుకు దోహపడుతుందని ఆశాభావం వెలిబుచ్చారు.

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను హరించి వేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చి వేస్తున్నదని మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు బాపట్లలో సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ముందుగా బాపట్ల పురవీధుల్లో రాష్ట్ర నలమూలల నుండి తరలివచ్చిన కార్మిక కూలిదండు మహాప్రదర్శన నిర్వహించింది. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద వేములపల్లి శ్రీకృష్ణ సభా ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కె.నారాయణ మాట్లాడుతూ పోరాడే హక్కు లేకుండా చట్టాలను సవరిస్తున్నారన్నారు. నాడు రాష్ట్రపతిగా కోవింద్‌ను అడ్డుపెట్టుకొని ఎస్సీ చట్టాను మార్చవేశారని, నేడు ద్రౌపదీ ముర్ము సంతకంతో అటవీ చట్టాలను మార్చి... సారవంతమైన అటవీ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో గిరిజనులను అణగదొక్కి అక్కడ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని నారాయణ తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయకపోగా అదానీ కంపెనీలకు రూ.13 లక్షల కోట్లు రాయితీ ఇచ్చారని విమర్శించారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అదానీ గంజాయి స్మగ్లర్‌గా ఎదిగాడని, నేడు ప్రధాని అయిన తర్వాత దేశంలోని అన్ని పోర్టులను అప్పనంగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. అదానీకి చెందిన ముద్ర పోర్టులో కోట్లాది రూపాయల విలువ చేసే మత్తుమందులు స్వాధీనం చేసుకున్నా చర్యలు తీసుకోలేదని చెప్పారు. సరఫరాదారులను పట్టుకోకుండా ఎవరో ఎక్కడో గంజాయి వాడారని కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన చట్టాల హామీలు అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలను నాశనం చేస్తున్నదని విమర్శించారు. దీనికి ప్రధాన కారణం నరేంద్ర మోదీ, వెంకయ్య నాయుడు, జగన్ అని నిందించారు. వారంతా చరిత్రహీనులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే వారిని జైలులో పెడుతున్నారని, జగన్‌మోహన్ రెడ్డి, అవినాశ్‌రెడ్డి, కవిత లాంటి వారిని బయట ఉంచి రాజకీయం నడిపిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం మరింత బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రతి వ్యవసాయ కార్మికుడికి భూమి దక్కాలని నాడు చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో దేశవ్యాప్తంగా పోరాటం చేస్తే జైళ్లన్నీ నిండిపోయాయని గుర్తుచేశారు. ప్రభుత్వాల కంటే కమ్యూనిస్టులే పేదలకు పెద్దఎత్తున సాయం చేశారని, నాటి ఉద్యమాల స్ఫూర్తితో కార్మికులు రాజకీయ చైతన్యంతో ఉద్ధృత పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యం ఖూనీ: రామకృష్ణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. భూమి కోసం-భుక్తి కోసం పోరాడింది ఎర్రజెండా మాత్రమేనని స్పష్టంచేశారు. దున్నేవాడికి భూమి నినాదంతో పెద్దఎత్తున భూపోరాటాలు సాగించిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. భూపోరాట ఉద్యమాల్లో పది లక్షల మంది అశవులు బాశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బంజరు భూములను పేదల నుండి లాక్కునేందుకు జులై 31న భూ ఆర్డినెన్స్ తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజ ఉద్యమాలను అణిచివేసి ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం, దొంగల రాజ్యం నడుస్తోందని, న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యమం చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని మండిపడ్డారు. హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన అంగన్‌వాడీలను ముందస్తు అరెస్టు చేయటం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రజల్లో చైతన్యం పెరగాలని, ప్రభుత్వ తప్పులను ప్రశ్నించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ముందుకు వెళ్లాలన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, గడిచిన నాలుగున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. మూడు రాజధానుల పేరుతో ముఖ్యమంత్రి నాటకాలాడుతున్నారని చెప్పారు. సంక్షేమ పేరుతో ముఖ్యమంత్రి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క దళితుడికైనా ఎకరా భూమి పంచారా అని ప్రశ్నించారు. ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని, ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా 28 రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడి ముందుకు వెళ్లడం శుభపరిణామమన్నారు. దేశాన్ని రక్షించండి-రాష్ట్రాన్ని కాపాడండి అనే నినాదంతో వ్యవసాయ కూలీలు, కార్మికులు ప్రజా పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రతి వ్యవసాయ కార్మికుడు భూ యజమాని కావాలి: జల్లి విల్సన్

ప్రభుత్వ బంజరు భూములు పేదవాడికి పంపిణీ చేయడం ద్వారా వారిని భూ యజమానులను చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు కొత్త భూ చట్టాలు తీసుకువస్తున్నాయని విమర్శించారు. దీనిపై ప్రతి వ్యవసాయ కూలీ రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భూపంపిణీ కోసం 90 ఏళ్లుగా ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వేసిన కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి...ఆ కమిటీ సిఫార్సులకు తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. సంక్షేమంతో పాటు భూమి లేని పేదలకు భూములు పంచాలని, వ్యవసాయ కార్మికులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని, పేదలకు ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులపాటు బాపట్లలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో అనేక తీర్మానాలు ఆమోదించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

తొలుత అతిథులను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ వేదికపైకి ఆహ్వానించగా ఆహ్వాన సంఘం కార్యదర్శి సింగరకొండ వందన సమర్పణ చేశారు. సభలో మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, మధు, ఎంఎల్ నారాయణ, రాష్ట్ర మహాసభల ఆహ్వానసంఘం ఉపాధ్యక్షులు ఆర్.వెంకట్రావు, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జేబీ శ్రీధర్, కోశాధికారి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యేలు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, బి.కేశవరెడ్డి, సి.సుబ్రమణ్యం, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, ఆలమంద ఆనందరావు, టి.కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు పి.చంద్రనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

ఎరుపెక్కిన బాపట్ల

- కూలి దండు మహా ప్రదర్శన
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళా కూలీలు
- ప్రదర్శన అగ్రభాగాన నడిచిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: వ్యవసాయ కూలీలు బాపట్లలో కదం తొక్కారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది వ్యవసాయ కార్మికులు బాపట్లకు తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం బాపట్ల పట్టణంలో మహా ప్రదర్శన నిర్వహించారు. పుర వీధులలో అరుణ పతాకాలు రెపరేపలాడాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్మికులు ఎర్ర జెండాలు చేపట్టి బాపట్ల రోడ్లపై బారులు తీరారు. మహా ప్రదర్శనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ప్రారంభమైన కూలీదండు మహాప్రదర్శన తప్పకాలువ మీదుగా పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌కు వచ్చి రధంబజార్ మీదగా రైల్వే స్టేషన్ రోడ్డులోని పింగళి వెంకయ్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకుంది. వ్యవసాయ కూలీలకు భూమి పంచాలని, కూలి రేట్లు పెంచాలని, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలనే నినాదాలతో పురవీధులు దద్దరిల్లాయి. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ప్రజానాట్యమండలి, డప్పుకళాకారుల వాయిద్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీలో పాల్గొన్న కార్మిక దండు చిన్నా పెద్ద, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా కళాకారులతో మమేకమై నృత్యం చేశారు. దీంతో సీపీఐ నేతలు కూడా కాలు కదిపి కార్మికుల ఉత్సాహానికి ఊతం ఇచ్చారు.

ఎర్రజెండాలతో బాపట్ల రోడ్లన్నీ ఎరుపుమయం అయ్యాయి. కూలీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండకట్టారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు కన్నెర్ర చేశారు. కార్మిక వర్గాన్ని ఎకతాటిపై తీసుకువచ్చి ఐక్య ఉద్యమాలను నిర్మిస్తామని ఎలుగెత్తి చాటారు. ఈ ర్యాలీ అగ్రభాగాన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు, డప్పు బృందాలు పురప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనకు ముందు వరుసలో 22వ రాష్ట్ర మహాసభలకు సూచికగా 22 జెండాలను మహిళలు చేత పట్టి ర్యాలీలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. మహా ప్రదర్శన అగ్రభాగాన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ , ఉపాధ్యక్షుడు ఆర్.వెంకట్రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల ఆజయ్‌కుమార్, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులు జేబీ శ్రీధర్, తన్నీరు సింగరకొండ, కోశాధికారి శ్రీనివాసరావు, సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బండి వెంకటేశ్వరరావు, కేశవరెడ్డి, సుబ్రమణ్యం, చిలకూరి వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, ఆనందరావు, కృష్ణప్ప తదితరులు నడిచారు.

ప్రజానాట్యమండలి పాటల ప్రవాహంలో

ఓలలాడిన వ్యవసాయ కూలీలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22 వ మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు పాటలతో కొత్త ఉత్తేజాన్ని కలిగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలనను ఎండ కట్టే విధంగా పాటలుపాడారు. ప్రభుత్వాలను నమ్మద్దు అంటూ చిన్నం పెంచలయ్య నమ్మద్దు బాబోయ్ ఓరి కూలన్న... ఇది దొంగల రాజ్యం ఓరి కూలన్న... ఇది దోపిడీ రాజ్యం అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలనను తూర్పార బట్టారు, చంద్రా నాయక్ రండి రండి రండి రండి బాపట్ల కు రండి... అందరూ కలిసి రారండి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో మీరు బారులు తీరండి అంటూ సభకు హాజరైన వారిని ఉత్తేజ పరిచారు , రండిరా మాయన్నా లెండిరా కూలన్న పోరం బోకు భుములల్లా పోరు రగులుతున్నదో రండిరా మాయన్న అంటూ భూ పోరాటాలకు ఊతమిచ్చేలా పాడారు... పిచ్చయ్య రండిరో కూలన్న సంఘం పెడదాం...వాళ్ల సంగతెందో చూద్దాము అంటూ సంఘం విస్తృత కొరకు ఉపయోగ పడేలా పాడారు. గుర్రప్ప పాడుతూ చరచర చరా మెరుపులు మెరవగా కన కన కన నిప్పులు కురవగా ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఇక తిరగబడాలే అంటూ తిరుబాటును రేకెత్తించారు .. శివయ్య తింటున్న కంచాన్ని గుంజు కుంటుండ్రు ధరలు పెంచి నోట్లో మన్ను కొడుతుండ్రు ఒరోరి ఎలేటోడ ఈ జనమెట్ల బతకాలిరా అంటూ ధరల పెరుగుదలను ఎండకట్టారు.. అనంత లక్ష్మీ పాడుతూ కష్టజీవి గుడిసెల్లో వెలిగేటి దీపమా.... కార్మికుల గుండెల్లో కొలువైన రూపమా అంటూ పేదొడికి ఎర్ర జెండా అండగా నిలిచిందని ఎర్రజెండా గొప్పతనాన్ని కీర్తించారు సత్యా పాడుతూ ఆకలన్నొడికి అన్నం పెట్టే కూలోలన్నయ్యే నీకు కూడు దొరకని రోజులొచ్చేరా.. పేదొలన్నయ్యో అంటూ కూలి నాలి పేద బతుకుల బాధలను వివరంగా విప్పి చెప్పారు. నాగరాజు భూమి మనది భుక్తి మనది శక్తీ మనది రా మట్టి నుండీ మణులు తీసే రైతుకూలీ సోదరా అంటూ కూలీల కష్టాన్ని వివరించారు , రామారావు పాడుతూ ఓ అరుణ పతాకమా చేగొనుమా రెడ్ సెల్యూట్ అంటూ అమర వీరులకు జోహార్లు అర్పించారు. సుబ్రమణ్యం పాడుతూ ఊరూరూ ఎర్ర బడుతు ఉంది ఈ పాలన పైన ప్రతి గుండె గాయ పడుతూ ఉంది అంటూ దళిత గిరిజన మహిళల పట్ల పాలకుల తీరును ఎత్తి పాడారు , మాచర్ల సిరిగల్ల భారత దేశం తమ్ముడా అంటూ ప్రభుత్వ సంస్థలను ఎలా అమ్ముతున్నరో... నిరుద్యోగం ఎలా పెంచుతున్నారో వివరించారు. ఈ పాటల సందడి ఆర్ రామకృష్ణ ఆధ్వర్యం లో జరిగింది... వాయిద్య సహకారం డప్పు సూరి , డోలక్ తిరుపతి రావు , కీ బోర్డు సాయి అందించారు .

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.